

అనుదినం జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రిభువనగిరి

1

శనివారం 10 జూన్ 2023

సాహిత్య దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

- కలెక్టర్ ఎస్. వెంకట్రావ్

నవతెలంగాణ -సూర్యాపేటకలెక్టరేట్

జిల్లాలో సాహిత్య రంగానికి ఎంతో ప్రాధాన్యత ఉందని జిల్లా కలెక్టర్ యస్. వెంకట్రావ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.దశాబ్ది ఉత్సవాలలో భాగంగా 11వ తేదీన స్థానిక సద్దుల చెరువు వద్ద సాయంత్రం 5 గంటలకు చేపట్టే తెలంగాణ సాహిత్య దినోత్స వేడుకలను కవులు, సాహితీ వేత్తలు, కళా కారులు, పుర ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు అట్టి కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేసి అందుబాటులో ఉంచాలని తెలిపారు. జిల్లాలో అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది వేడుకల్లో తప్పక పాల్గొనాలని పేర్కొన్నారు.

ఉష్ణోగ్రతలు

	గరిష్ఠ	కనిష్ఠ
నల్లగొండ	43.5	24.8
సూర్యాపేట	43.8	33.7
యాదాద్రిభువనగిరి	40.5	30.1

ఉమ్మడి జిల్లాలోనే ముగ్గురు ముఖ్యమంత్రులట

- కాంగ్రెస్ అధికారంలోకొస్తే అస్తవ్యస్తం
- గొర్రెల పంపిణీ కార్యక్రమంలో మంత్రి తలసాని



నవతెలంగాణ-నకిరేకల్

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే కాంగ్రెస్ పార్టీ నుండి ముగ్గురు ముఖ్యమంత్రి అభ్యర్థులమంటూ ప్రచారం చేసుకుంటున్న తీరును పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఎద్దేవ చేశారు. శుక్రవారం స్థానిక మినీ స్టేడియంలో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో ముఖ్యమంత్రి అభ్యర్థి జిల్లాలో వారిని, వీరిని గెలిపించానని ప్రగల్భాలు పలుకుతున్న తాను ఎందుకు ఓడిపోయాడో చెప్పాలని పరోక్షంగా ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఉద్దేశించి ఎద్దేవా చేశారు. గొల్ల కురుమలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ముఖ్యమంత్రి గొర్రెల పంపిణీ పథకాన్ని తీసుకొచ్చారన్నారు. తెలంగాణలో ప్రతిపక్షాలకు కనీసం జానం లేదన్నారు. ముఖ్యమంత్రి మాటిస్తే వెనకకు పోరని, అర్హులైన గొల్ల కురుమలకు అందరికీ యూనిట్లు అందజేస్తామన్నరు. కాంగ్రెస్ పాలనలో నల్లగొండ జిల్లా కరువు బారిన పడిందన్నారు. ఫ్లోరైడ్ పాపం కాంగ్రెస్ వాళ్లదేనన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో కుల వృత్తులకు పూర్వ వైభవం వచ్చిందన్నారు.

వ్యవసాయంలో నెంబర్ వన్ స్థానంలో నల్లగొండ

మంత్రి జగదీశ్‌రెడ్డి

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై తొమ్మిదేళ్ల పూర్తయిన సందర్భంగా దశాబ్ది సంబరాలు జరుపుకుంటున్నామని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. గొర్రెల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యవసాయంలో నెంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టం అయిందన్నారు. చేపల ఉత్పత్తిలో ఆంధ్రాను మించి తెలంగాణ నెంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు. ఈ దేశంలో ఆకలి దరిద్రానికి కారణం కాంగ్రెస్ పార్టీయే అన్నారు. అందుకే కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో విసిరేశారని పేర్కొన్నారు. ఈ దేశానికి కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అన్నారు.

గొంతులో ప్రాణం ఉన్నంతవరకు బీఆర్ఎస్‌ను వీడేది లేదు

కేసీఆర్ గంగలో దూకమన్న దూకుతా

గొర్రెల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే చిరుమర్తి

గొంతులో ప్రాణం ఉన్నంతవరకు బీఆర్ఎస్ పార్టీని వీడేది లేదని స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మినీ స్టేడియంలో జరిగిన గొర్రెల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గంగలో దూకమన్న దూకుతానన్నారు. బీఆర్ఎస్ పార్టీని వీడి ఇంకో పార్టీలో చేరేది లేదన్నారు. కొంతమంది రాజకీయంగా గిట్టని వారు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని పేర్కొన్నారు. తాను నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీని వీడి బిఆర్ఎస్ పార్టీలో చేరానన్నారు. నకిరేకల్ లో ప్రశాంత వాతావరణం నెలకొని ఉండాలంటే తనను మూడవసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, జిల్లా పరిషత్ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, గొర్రెల మేకల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్, డైరీ కార్పొరేషన్ చైర్మన్ భరత్ కుమార్, గ్రంథాలయ చైర్మన్ రేగట్టే మల్లికార్జున్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్తా, ఓఎస్‌డీ కళ్యాణ్ కుమార్, ఎంపీపీ లు బచుపల్లి శ్రీదేవి గంగాధర్ రావు, జిల్లా ముత్తిలింగం, జడ్పీటీసి మాద ధనలక్ష్మి నగేష్ గౌడ్, తరాల బలరాం, మునిసిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోహిణికార్తెను తలపిస్తున్న ఎండలు

- రోహిణికార్తెను తలపిస్తున్న ఎండలు
- ఇప్పటికే విత్తనాలను సిద్ధం చేసిన వ్యవసాయశాఖ
- తొలకరి కోసం రైతన్నకు తప్పని ఎదురుచూపులు

ఖరీఫ్ సాగుకు కోటి ఆశలతో అన్నదాత సన్నద్ధమయ్యాడు. తెల్లవారుజాము కోడి కూత మొదలుకొని హలం పట్టి పొలం దున్నడానికి రైతన్నలు సిద్ధమవుతున్నారు. మరోపక్క వ్యవసాయశాఖ ఖరీఫ్‌కు సంబంధించి ప్రణాళిక సిద్ధం చేసింది. జిల్లా వ్యాప్తంగా గతేడాది వర్షాభావ పరిస్థితుల పుణ్యమా అని పూర్తిగా కరువు పరిస్థితులు నెలకొని చినుకు రాలలేదు. అన్నదాత తీవ్ర స్థాయిలో నలిగిపోయాడు. ఈసారి ఖరీఫ్‌కు సంబంధించి సాగుకు అన్నదాత సిద్ధమయ్యాడు. అందులోనూ రోహిణికార్తె సమయంలో రోళ్లు సైతం పగిలిపోతాయని నానుడి ఉంది. రోహిణికార్తె పోయి మృగశిర వచ్చింది. ప్రస్తుతం ఆశలన్నీ మృగశిరపైనే నెలకొన్నాయి.

నవతెలంగాణ-నల్లగొండ

జిల్లాలో అన్నదాతలు ప్రస్తుతం పొలాలను దున్ని.. పంటలు సాగు చేయడానికి సిద్ధమయ్యారు. ఎక్కువగా పత్తి, వరి పంటలు సాగవుతాయి. ఖరీఫ్‌లో వర్షాధారం కింద ఒకపక్క, ఇంకోపక్క కేసీ కెనాల్ కింద కూడా వరి పంటను కూడా సాగు చేస్తారు. అయితే జిల్లా వ్యాప్తంగా 12 లక్షల ఎకరాల వరకు సాగు భూమి ఉండగా.. 11 లక్షల 54 వేల హెక్టార్లలో పంటల సాగు చేసే అవకాశముందని వ్యవసాయశాఖ గుర్తించింది. జిల్లా వ్యాప్తంగా నాలుగు లక్షల 57 వేల మంది అన్నదాతలు ఉన్నారు. ప్రస్తుతం మృగశిర కార్తె మురిపిస్తుందని రైతన్నలు ఎదురుచూస్తున్నారు. ప్రతి ఏడాది జూన్‌లో వర్షాలు రావడం, సాగుతోపాటు పంటలు వేయడం జరుగుతుంది. అయితే గత రెండు, మూడేళ్లుగా కరువు పరిస్థితులు నెలకొనడంతో సాగు విస్తీర్ణం దారుణంగా పడిపోయింది. ఈసారి వాతావరణ పరిస్థితి అనుకూలంగా ఉంటుందని వాతావరణ శాస్త్రవేత్తలు పేర్కొన్న నేపథ్యంలో వర్షాలు కురుస్తాయని అన్నదాతలు ఎదురుచూస్తున్నారు.



రోహిణిని తలపిస్తున్న ఎండలు

జిల్లాలో రోహిణికార్తె ప్రారంభంలో ఎండలు మాత్రం బీభత్సంగా ఉన్నాయి. జూన్ నెల ప్రారంభమై 10 రోజులు కావస్తున్నా ఇప్పటికీ ఎండల వేడి మాత్రం తగ్గలేదు. పైగా వేడిగాలులు కూడా భయపెడుతున్నాయి. ఒకప్రక్క ఎండలు, మరోపక్క వేడిగాలులు, ఇంకోప్రక్క ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. రోహిణికార్తె సమయంలోనే ఎండలు అధికంగా ఉంటాయి. అలాంటిది కార్తె పోయినా కూడా తలపించేలా ఇప్పుడు ఎండలు కనిపిస్తుండడం ఆందోళన కలిగించే పరిణామం. ఏది ఏమైనా భారీ వర్షాలు కురిస్తే తప్ప ఉపశమనం కనిపించడం లేదు.

రుతు పవనాలపైనే ఆశలు...

రాష్ట్రంలోకి నైరుతి రుతు పవనాలు నాలుగైదు రోజుల్లో ప్రవేశించనున్నాయి. రుతు పవనాల రాకతో వర్షాలు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. మంచి వర్షాలు కురిస్తే ఖరీఫ్ సీజన్ ఆశాజనకంగా ప్రారంభించవచ్చని అన్నదాతలు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటివరకు అక్కడక్కడ తొలకరి జల్లులు మాత్రమే కురిశాయి. కొంతమేర భారీ వర్షాలు వస్తేనే ప్రస్తుత ఖరీప్ సీజన్‌లో సాగుకు అనుకూల పరిస్థితి ఉంటుంది. ఆకాశం మేఘావృతం అవుతున్నా గాలులు, ఇతర కారణాలతో సరైన వర్షపాతం నమోదు కాలేదు. ప్రస్తుతం జూన్‌కు సంబంధించి 73.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా....ఇప్పటివరకు 14.9 మి.మీ. కురిసింది. మరో 58.5 మి.మీ. లోటు వర్షపాతం కురిసింది. ఈ క్రమంలో ప్రస్తుతం రుతుపవనాలపైనే రైతన్నలు ఆశలు పెట్టుకున్నారు.

వ్యవసాయశాఖ సన్నద్ధం...

ఖరీఫ్‌సాగుకు వ్యవసాయశాఖ సన్నద్ధమైంది. అందుకు సంబంధించి ప్రభుత్వం సరఫరా చేసే విత్తన,కాయల ధరలను నిర్ణయించగా....ఇప్పటికే విత్తన కాయలను మండలాలను మంజూరు చేశారు. జిల్లాకు 60,767 క్వింటాళ్లను కేటాయించారు. అంతేకాకుండా మిగతా అన్ని రకాల పంటలకు సంబంధించి విత్తనాలను కలుపుకుని మరో 49 వేల క్వింటాళ్ల అవసరమని ప్రణాళికలు రూపొందించారు. విత్తనాలను అందించి రైతన్నలను సిద్ధం చేయడం ద్వారా ఎప్పుడు వర్షం పడినా అప్పటికప్పుడు విత్తుకోవడానికి అనుకూలంగా ఉంటుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. అంతేకాకుండా 1.30 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు కూడా అవసరమని ఇప్పటికే వ్యవసాయశాఖ జూన్ మొదటివారంలోనే నివేదికలు పంపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట

సాధించి తెచ్చుకున్న తెలంగాణలో ప్రజారంజన పాలన అందిస్తున్నామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంట కండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సుమంగలి ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సంక్షేమ సంబురాలు వేడుకల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో కూడా జరగని అభివృద్ధి సంక్షేమ పథకాలు సాధించుకొనే తెచ్చుకున్న తెలంగాణలో ప్రజల అభిరుచి మేరకు అనేక పథకాలను అమలు చేస్తున్నామన్నారు. గత పాలకుల పాలనలో అనేక రంగాలు ప్రజలు ఎంతో నష్ట పోయాయని విద్యుత్, సాగు నీరు,తాగునీరు, అందక అష్ట కష్టాలు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం ఉన్నత మైన ఆలోచనలతో ప్రజలకు ప్రజారంజన పాలన అందిస్తున్నామన్నారు. ప్రధాన మంత్రి రాష్ట్రంలో కూడా ఇప్పటికి విద్యుత్ 6 గంటలు, పింఛన్లు, సాగునీరు, త్రాగునీరు అందించలేని పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో రైతు బంధు, దళిత బంధు, కళ్యాణ లక్ష్మీ, షాదిముబారక్, గృహాలకు, పారిశ్రామిక రంగాలకు నాణ్యమైన నిరంతర విద్యుత్ అలాగే రైతాంగానికి ఉచితంగా నిరంతర విద్యుత్ అందిస్తున్నామని స్పష్టం చేశారు. అనంతరం గిరిజన సంక్షేమ అభివృద్ధి శాఖ ద్వారా ద్వారా రూ. 5 లక్షలతో సూపర్ మార్కెట్, ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున చికెన్, మటన్, టిఫిన్ సెంటర్‌లను పెట్టుకునేందుకు చెక్కులను అందజేశారు. బీసీకులాలకు చెందిన కుల వృత్తులకు నూరు శాతం సబ్సిడీతో లక్ష చొప్పున ఆరుగురు లబ్దిదారులకు చెక్కులు అందజేశారు. నియోజకవర్గానికి చెందిన 215 మందికి కల్యాణ లక్ష్మీ షాది ముబారక్ పథకం ద్వారా లబ్దిదారులకు రూ. 2 కోట్ల 16 లక్షల విలువగల చెక్కులను అందజేశారు. అనంతరం కులాంతర వివాహం, దళిత బంధు, కల్యాణ లక్ష్మీ ద్వారా లబ్ది పొందిన లబ్దిదారులతో సభా వేదిక పై నుండి మాట్లాడించారు. సభలో తెలంగాణ సాంస్కృతిక సరాధులు ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమలపై పాటల అలరింపజేశారు. ఈ కార్యకమాంలో జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్, ఆదనవు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్, మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమల్ల అన్నపూర్ణ, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్‌చైర్మెన్ పుట్టా కిషోర్, సూర్యాపేట జెడ్పీటీసీ జిడి బిక్షం, జెడ్పీ సీఈఓ సురేష్ కుమార్, డీటీడీఓ కొమ్ము శంకర్, డీఎస్పీ నాగభూషణం, ఎంపీపీలు రవీందర్, నెమ్మాది బిక్షం, కుమారి , జెడ్పీటీసీ లు, సర్పంచులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

నవతెలంగాణ- తుంగతుర్తి

ఈనెల 12న మండల కేంద్రంలోని శ్రీ విద్యా భారతి ఉన్నత పాఠశాల ఆవరణలో కృష్ణవేణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా హెల్త్ క్యాంప్‌ను జయప్రదం చేయాలని కృష్ణవేణి ఫౌండేషన్ చైర్మెన్ ఎస్.కృష్ణవేణి అన్నారు.శుక్రవారం మండల కేంద్రంలో మెగా హెల్త్ క్యాంపుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. అపోలో స్పెక్ట్రా సౌజన్యంతో సాధారణ వైద్య సేవలతో పాటు గుండెకు సంబంధించిన వాటిపై కూడా ఉచితంగా వైద్య సేవలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా గుండెకు సంబంధించిన 2డి ఈకో,ఈసీజీ,ఆర్ బి ఎస్,బీపీ చెక్ అప్ తదితర వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. హైదరాబాద్ కు చెందిన అపోలో డాక్టర్లు మెగా హెల్త్ క్యాంపులో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ ఉపాధ్యక్షులు ఇస్మాయిల్, జర్నలిస్టులు సోమన్న, సుభాష్, నజీర్, రామచంద్రు, ప్రధానోపాధ్యాయులు మల్లయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు తీపి కబురు

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

ఎన్నికలు సమీపిస్తున్న వేల దివ్యాంగులకు సీఎం కేసీఆర్ గుడ్ న్యూస్ చెప్పారు. ఇప్పటికే దివ్యాంగులకు ఇస్తున్న రూ.3,016 పెన్షన్‌కు మరో వెయ్యి రూపాయలు పెంచి మొత్తంగా 4,016 రూపాయలు ఇవ్వనున్నట్టు కేసీఆర్ ప్రకటించారు. శుక్రవారం మంచిర్యాలలో నిర్వహించిన ప్రగతి నివేదన సభలో సీఎం కేసీఆర్ ఈ ప్రకటన చేశారు. ఈ పెంచిన పెన్షన్‌ను వచ్చే నెల నుంచి ఇవ్వనున్నారు. ఈ ప్రకటనతో జిల్లాలో ఉన్న 34,973 మంది వికలాంగులకు లబ్ధి పొందనున్నారు.

సీఎం కేసీఆర్‌కు బుద్ధుందా? తలకాయ ఉండే మాట్లాడుతున్నాడా?

- నేను మాట్లాడిందేంటి? సీఎం కేసీఆర్ మాట్లాడుతున్నదేంటి?
- విలేకరుల సమావేశంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

నవతెలంగాణ-దేవరకొండ

సీఎం కేసీఆర్‌కు బుద్ధిందా? తలకాయ ఉండే మాట్లాడుతున్నాడా? నేను మాట్లాడింది ఏంటి? కేసీఆర్ మాట్లాడుతున్నదేంటని పీపుల్స్ పాదయాత్ర నాయకుడు, సీఎల్పీ నేత మల్లు బట్టి విక్రమార్క కెసిఆర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర 85వ రోజు శుక్రవారం దేవరకొండ నియోజకవర్గం చందంపేట మండలం గన్నేరులపల్లి చేరుకుంది. ఈ సందర్భంగా శిబిరం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధరణి అనే సాఫ్ట్వేర్ తీసుకువచ్చి కాస్తు కాలంలో ఉన్న పేర్లను ఒక్కసారిగా తీసివేస్తే తరతరాలుగా దున్నుకుంటున్న వాళ్ల హక్కులు కోల్పోయి పట్టాలో ఉన్న వారికి తెలంగాణ పాస్ పుస్తకాలు ఇస్తున్నారని, ఆ హక్కులు కోల్పోయిన వారి గురించి మాట్లాడుతుంటే వారి గురించి పట్టించుకోకుండా ధరణి తీసివేయాలని సన్నాసి ఎవరో మాట్లాడాడంట అంటూ నాగర్ కర్నూల్లో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఈ విధంగా ఫైర్ అయ్యారు. మన ఇద్దరం సన్నాసులమని తిట్టుకుంటే ప్రజల సమస్యలు పక్క దారిన పడతాయా అని అది నాకు ఇష్టం లేదన్నారు. ధరణి వల్ల హక్కులు కోల్పోయిన బాధితులు పాదయాత్రలో తన వద్దకు వచ్చి చెప్పిన సమగ్ర సమాచారంతో లేవనెత్తిన ప్రజా సమస్యల అంశాలపై సమాధానం చెప్పకుండా కేసీఆర్ సన్నాసి అని వ్యాఖ్యలు చేయడం, కేటీఆర్ సన్నాసి యాత్ర అంటూ విమర్శలు చేయడం వారి సభ్యత, సంస్కారానికి వదిలేస్తున్నానన్నారు. తనకు సభ్యత సంస్కారం ఉన్నందున గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ , గౌరవ మంత్రి కేటీఆర్ ప్రజా సమస్యలపై లేవనెత్తిన అంశాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నానన్నారు. దళితులకు మూడెకరాల భూమి పంపిణీ చేస్తామని విస్మరించింది నిజం కాదా?గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలకు 24 లక్షల ఎకరాల భూమిని పంచగా ధరణి సాఫ్ట్వేర్ తీసుకువచ్చి కుట్రపూరితంగా వెనక్కి తీసుకుంటున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న అత్యంత విలువైన భూములను గత ప్రభుత్వాలు పేదలకు పంపిణీ చేయగా వాటిని వెనక్కి తీసుకొని అమెరికా, దుబాయ్ కంపెనీలకు అమ్ముతున్నది నిజం కాదా? అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఒక్క చెరువు కొత్తది కూడా తొవ్వించకుండా సాగునీటి వారోత్సవాలు చేయడానికి సిగ్గు చేటన్నారు. బీఆర్ఎస్ దొరల పక్షాన నిల్చుంటే.. కాంగ్రెస్ ప్రజల పక్ష నిలబడుతుందన్నారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షులు శంకర్‌నాయక్, మాజీ ఎమ్మెల్యే బాలునాయక్, చందంపేట ఎంపీపీ ఎన్. పార్వతీ చందు నాయక్, జాల నరసింహారెడ్డి, రమావత్ జగన్ లాలు, కేతావత్ బిలియా నాయక్, నేనావత్ కిషన్ నాయక్, తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



యాదాద్రి భువనగిరి జిల్లాలో పలువురు సీఐలు బదిలీ

నవతెలంగాణ- భువనగిరిరూరల్

యాదాద్రి భువనగిరి జిల్లాలో పలువురు సీఐలు బదిలీ అయినట్లు రాచకొండ కమిషనర్ డీఎస్.చౌహన్ ఒక ప్రకటనలో తెలిపారు. బి.వెంకటరెడ్డి వెయిటింగ్ ఫర్ పోస్ట్‌లో ఉండగా ఆయన బాలాపూర్ పీఎస్ ఎస్‌హెచ్‌ఓగా బదిలీ అయ్యారు. బి. భాస్కర్ బాలాపూర్ ఎస్‌హెచ్ఓ సీఐ సెల్ కు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. బి.సత్యనారాయణ పట్టణ సీఐ, రూరల్ సీఐగా బదిలీ అయ్యారు. ఏ.వెంకటయ్య భువనగిరి రూరల్ సీఐ స్పెషల్ బ్రాంచ్ కు బదిలీ అయ్యారు. ఎం మధు కుమార్ జవహర్ నగర్ పిఎస్ నుంచి సైబర్ క్రైమ్ పీఎస్ కు బదిలీ అయ్యారు. బి.ఉపేందర్ రావు ఎల్బీనగర్ పీఎస్ నుంచి ఉప్పల్ పిఎస్ కు బదిలీ అయ్యారు. కే యాదగిరి మల్కాజ్గిరి పిఎస్ నుంచి చౌటుప్పల్ పిఎస్ కు బదిలీ అయ్యారు. ఎస్ పాండు చౌటుప్పల్ పీఎస్ నుంచి చైతన్యపురి పీఎస్ కు బదిలీ అయ్యారు. బి.సైదులు చౌటుప్పల్ పిఎస్ నుంచి సైబర్ క్రైమ్ పిఎస్ కు బదిలీ అయ్యారు. సిహెచ్.శేఖర్ యాదగిరిగుట్ట పీఎస్ నుంచి చర్లపల్లి పీఎస్ కు బదిలీ అయ్యారు.బి.రవీందర్ బోనగిరి సీసీఎస్ నుంచి సైబర్ క్రైమ్‌కు బదిలీ అయ్యారు. ఎల్.రవీందర్ సీసీఎస్ మల్కాజిగిరి నుంచి భువనగిరి టౌన్‌కు బదిలీ అయ్యారు. ఎస్ సైదులు సీసీఎస్ ఎల్బీనగర్ నుంచి చౌటుప్పల్ పీఎస్ కు బదిలీ అయ్యారు. పి.రామ్ సూర్యం వనస్థలిపురం ట్రాఫిక్ నుంచి సైబర్ క్రైమ్ కు బదిలీ అయినట్లు రాచకొండ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు రాచకొండ కమిషనరేట్ పీఆర్ఓ తెలిపారు.

వర్షాధార పంటల సాగు విస్తీర్ణం పై సర్వే

నవతెలంగాణ -సూర్యాపేటరూరల్

సూర్యాపేట మండల పరిధిలోని తాళ్ల ఖమ్మం పహాడ్ గ్రామంలో శుక్రవారం స్థిర నీటి వనరులు లేకుండా కేవలం వర్షాధారంగా సాగు అయ్యే భూములు, విస్తీర్ణంపై వ్యవసాయ అధికారులు సర్వే నిర్వహించారు.గ్రామలలో ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, బోర్లు, బావుల తోపాటు వర్షాధారంగా సాగువతున్న పంటల వివరాలు, సాగు విస్తీర్ణంని అధికారులు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ జానిమియా, ముత్తయ్య గ్రామ ఉప సర్పంచ్ పాముల సైదులు, రైతుబంధు కోఆర్డినేటర్ అండెం మారయ్య, మాజీ సర్పంచ్ కాశయ్య, రైతులు మిర్యాల కృష్ణారెడ్డి మొదలగు వారు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అమలు

- ప్రభుత్వ విప్ ,శాసనసభ్యురాలు గొంగిడి సునీత

నవతెలంగాణ- ఆలేరుటౌన్



సబ్బండ వర్గాలు ఉద్యమించి, సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో పారదర్శకంగా అమలవుతున్నాయన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణకేంద్రంలో దినేష్ గార్డెన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వేలకోట్ల రూపాయలతో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలలో లోటుపాట్లు ఉన్నట్లయితే ప్రతిపక్షాలు సలహాలు సూచనలను తెలపవచ్చున్నారు.నియోజకవర్గంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం సమగ్రంగా అమలు, బీడీ కార్మికులకు పెన్షన్లు, గర్భిణులకు 13000 పారితోషికం డయాలసిస్ వ్యాధిగ్రస్తులకు పెన్షన్లు అందుతున్నాయన్నారు. ఆలేరు మాజీ శాసనసభ్యులు, కుడుదుల నగేష్ మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గం లోని పలు మండలాలలో దళితుల భూముల అన్యకాంతం అవుతున్నాయని వాటిని అరికట్టాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ గణాంకాల ప్రకారం అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందజేయాలని సూచించారు. అనంతరం వివిధ ప్రభుత్వ పథకాల కు చెందిన చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ సునీత, కలెక్టర్ పామేలాసత్పతిలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ నాగేంద్ర,బీసీ, ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అధికారులు శ్రావణ్ కుమార్, యాదయ్య,వెటర్నరీ జిల్లా అధికారి కృష్ణ, తాసిల్దారు రామకృష్ణ, మండల అభివృద్ధి అధికారి జ్ఞాన ప్రకాష్ రావు,మున్సిపల్ చైర్మెన్ వస్పరి శంకరయ్య,కమిషనర్ పీ. చక్రపాణి,వెటర్నరీ మండల అధికారి చైతన్య, మేనేజర్ శ్రీధర్ రెడ్డి, యాదగిరిగుట్ట జెడ్పీటీసీ తోటకూర అనురాధ,ఎంపీటీసీ జూకంటి అనురాధ అనిల్, నియోజకవర్గంలోని వివిధ మండలాల జెడ్పిటిసిలు, ఎంపీపీలు , తహసీల్దార్లు ఎంపీడీవోలు, బీఆర్ఎస్‌నాయకులు పాల్గొన్నారు.

అనుదినం జనపక్షం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ
2
శనివారం 10 జూన్ 2023



వీహెచ్‌పీఎస్ ధర్నాను విజయవంతం చేయండి

నవతెలంగాణ-నల్లగొండ

ఈనెల 11న నల్లగొండ జిల్లా కలెక్టర్ రేట్ వద్ద వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పెండింగ్ డిమాండ్ల సాధన కోసం నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పెరిక శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి ఎమ్మార్పీఎస్, వీహెచ్పిఎస్, ఎంఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారని తెలిపారు. ధర్నా కార్యక్రమానికి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని వికలాంగులు, ఆసరా పెన్షన్‌దారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మత్స్య రంగంలో పది లక్షల మందికి ఉపాధి

నవతెలంగాణ-చిట్యాలటౌన్

రానున్న రెండు మూడు సంవత్సరాలలో మత్స్య రంగంలో అనేక మార్పులు జరగబోతున్నాయని, ఈ రంగంలో పది లక్షల మందికి ఉపాధి అవకాశాలు రాబోతున్నాయని తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మెన్ పిట్టల రవీందర్ వెల్లడించారు. చిట్యాల పురపాలక కేంద్రంలోని రైతు వేదిక భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన తెలంగాణ ముదిరాజ్ మాస్టకారుల సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నూతన సాంకేతిక పద్ధతులను అలవర్చుకొని మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సూచించారు. ఈటెల వెంకటేశం అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఆకుల వెంకన్న, కావలి ఆంజనేయులు, రాముల రామలింగం, బోయ నరసింహ, భయ్యా రవీందర్ పాల్గొన్నారు.

ముగిసిన విద్యాశాఖ బడిబాట ఉత్సవాలు

నవతెలంగాణ-చిట్యాలటౌన్



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట ఉత్సవాలు చిట్యాలలో శుక్రవారం ముగిశాయి. బడిబాట ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోగికార్ మాధవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు గోగికార్ మాధవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు అండగా భవిత కేంద్రాలు

నవతెలంగాణ-చిట్యాలటౌన్

సమాజంలో వేసే ప్రతి అడుగుకూ అంగవైకల్యం అడ్డుకారాదని, మనోస్థైర్యంతో ముందుకెళ్లాలనే యోచనతో వికలాంగులకు భవిత కేంద్రాలు శిక్షణనందిస్తున్నాయని, వీటిని వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి కూకుట్ల నర్సింహా అన్నారు. చిట్యాల మండల కేంద్రంలోని భవిత కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక అవసరాలు కలిగిన ఐదేళ్ల పైబడి 18 ఏళ్ల లోపు పిల్లలకు సమగ్ర శిక్షా ద్వారా భవిత కేంద్రాల్లో నిత్యకృత్యాలతో పాటు విద్య, స్పీచ్‌థెరపీ, ఫిజియోథెరపీ తదితర అంశాల్లో మెలకువలు నేర్పుతున్నట్లు చెప్పారు. వికలాంగుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడకుండా పిల్లలను భవిత కేంద్రాలలో చేర్పిస్తే సామాన్యుల్లాగే మెలిగేలా ఈ కేంద్రాల్లో తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు బోయ శ్రీనివాసులు, ఆవుల గీత, సిఆర్పిలు జాన్ కిషోర్, జయకాంత్, సరిత తదితరులు పాల్గొన్నారు.

పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి వర్థతి

నవతెలంగాణ-చండూర్

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, మాజీ మంత్రి పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి 6 వ వర్థంతి సందర్భంగా ఏఐసీసీ సభ్యురాలు, కాంగ్రెస్ మునుగోడు ఇన్‌చార్జి పాల్వాయి స్రవంతిరెడ్డి తన తండ్రి కాంస్య విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్రవంతి రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం పోరాడిన వ్యక్తి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేసిన వ్యక్తి అని కొనియాడారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి పున్న కైలాస్ నేత, బుర్కాల బిక్షం, మంచుకొండ సంజయ్, వన్నాల లింగయ్య, నేర్లకంటి రవికుమార్, మాజీ సర్పంచ్ కోడి గిరిబాబు, సాగర్‌రెడ్డి, కలెట్ల మారయ్యా పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదవారికి ఒరిగిందేమీ లేదు

నవతెలంగాణ-నకిరేకల్

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదని టీపీసీసీ రాష్ట్ర మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దైద రవీందర్ విమర్శించారు. శుక్రవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదలను మరింత పేదలుగా మార్చడమే సంక్షేమ పథకాల లక్ష్యం అన్నారు. వృద్ధులకు నెలకు రూ. 2 వేలు పింఛనిస్తున్నామని ప్రగల్బాలు చెబుతున్న ఆ పింఛను బెల్టు షాపుల రూపంలో తిరిగి వెనక్కి తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు స్వయం ఉపాధి నిమిత్తం కార్పొరేషన్ల ద్వారా తొమ్మిదేళ్లలో ఎవరికి రుణాలు ఇచ్చి స్వయం ఉపాధి కల్పించారో చెప్పాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పాండు నాయక్ కుటుంబానికి అండగా ప్రభుత్వం

రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించిన సీఎం కేసీఆర్

నవతెలంగాణ-దేవరకొండ



చెరువుల పండుగ సందర్భంగా గురువారం డిండి మండలం దాసరి నెమిలిపూర్ గ్రామానికి చెందిన వడిత్య పాండు ప్రమాదంలో మరణించడం పట్ల ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్‌రావు సంతాపాన్ని ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు సీఎం తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే రామావత్ రవీంద్ర కుమార్ అభ్యర్థన మేరకు వారి కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను సీఎం ప్రకటించారు. శుక్రవారం దేవరకొండ శాసన సభ్యులు రవీంద్ర కుమార్ ప్రభుత్వ ఆస్పత్రిలో పాండు నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

టీడీపీ దళిత విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా కాశయ్య

నవతెలంగాణ-మిర్యాలగూడ



తెలంగాణ తెలుగుదేశం పార్టీ దళిత విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామానికి చెందిన నూకపంగు కాశయ్య రెండోవసారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కాశయ్య మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ దళిత సామాజిక వర్గానికి అభివృద్ధికీ కృషి చేస్తానని, నాపై నమ్మకం ఉంచి రాష్ట్ర కమిటీలో రెండవసారి ఎంపిక చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ బంధు ఇవ్వాల్సిందే..

నవతెలంగాణ-మిర్యాలగూడ

బీసీలకు బీసీ బందు పథకం ద్వారా పది లక్షల రూపాయలు ఇవ్వాల్సిందేనని లేనిపక్షంలో వచ్చే ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీకి రాజకీయ సమాధి తప్పదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ హెచ్చరించారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు హడావుడిగా బీసీలకు లక్ష రూపాయల ఆర్థిక సాయం ప్రకటించడం అంటే బీసీలను బిచ్చగాలుగా చేయడమేనని ఆయన పేర్కొన్నారు. నిజంగా బీసీల పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రేమ ఉంటే బీసీ బందు పథకం పెట్టి ప్రతి ఒక్క కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆర్థిక సాయం చేయాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బంటు వెంకటేశ్వర్లు, ఊరిబండి శ్రీనివాస్ యాదవ్, దాసరాజ్ జయరాజ్, చేగొండి మురళియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని మహిళా ఆత్మహత్య



నవతెలంగాణ-కేతపల్లి

ఉరేసుకొని మహిళా ఆత్మహత్య చేసుకున్న సంఘటన కేతపల్లి మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కేత పెళ్లికి చెందిన పసల బాల భాస్కర్ తన అన్నదమ్ముల మధ్య గత కొన్ని రోజులుగా భూ వివాదం జరుగుతుంది. ఈ భూ వివాదం సమస్య కారణంగా పసల బాల భాస్కర్ తన భార్య సరితకు ఇంట్లో కొద్దిరోజులుగా తగాదా పడుతున్నారు. ఈ భూతగాధ విషయంలో మనస్థాపానికి గురైన సరిత (28) ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకొని మృతి చెందింది. చుట్టుపక్కల వాళ్ళు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సరిత తండ్రి బందలూరుదు రాజు ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ ఎస్ వెంకటేశ్వర్లు పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

వాల్య మృతి బాధాకరం

నవతెలంగాణ-చందంపేట



చందంపేట మండలం సంధ్య తండాకు చెందిన జర్పుల వాల్య మృతి బాధాకరమని దేవరకొండ శాసన సభ్యులు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం సంధ్య తండాలో వాల్య కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి మాట్లాడారు. వాల్య మృతి పార్టీకి లోటు అన్నారు. ఆయన వెంట రైతు బంధు అధ్యక్షుడు రాజినేని వెంకటేశ్వర్‌రావు, గోసుల అనంతగిరి, స్థానిక సర్పంచ్ జర్పుల లోక్యనాయక్, సోమ్లానాయక్, బొడ్డుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధిలో ఆదర్శం తెలంగాణ

● సంక్షేమశాఖ ఉత్సవాల్లో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



నల్లగొండ

నవతెలంగాణ-నల్లగొండ

ప్రజా సంక్షేమం అభివృద్ధిలో సీఎం కేసీఆర్ సారథ్యంలోని తెలంగాణ ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తుందని నలగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శుక్రవారం స్థానిక పోలీస్ ఆడిటోరియంలో నిర్వహించిన సంక్షేమ ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేకం రాష్ట్రం ఏర్పడిన నాటికి ముందు ప్రస్తుతం తెలంగాణ తోపాటు నియోజకవర్గాలు ఏ విధంగా అభివృద్ధి చెందాయో ప్రజలంతా గమనించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు గురుకులాలను ఏర్పాటు చేసి ఉచితంగా ఇంగ్లీష్ మీడియంలో విద్యను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అన్నారు. నల్లగొండ నియోజకవర్గం కెసిఆర్ ఆశీర్వాదంతో 1200 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని ఇప్పటికే రోడ్ల వెడల్పుతో పాటు ఐటీ హబ్ పార్కుల అభివృద్ధి



మిర్యాలగూడ

ఆధునిక ఎన్జీ కళాశాల నూతన భవనంతో పాటు వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్ ప్రభుత్వానికి అండగా నిలబడాలని కోరారు. అనంతరం లబ్దిదారులకు గొర్రెల యూనిట్లతో పాటు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నల్గొండ మున్సిపల్ చైర్మెన్ మందడి సైదిరెడ్డి, వైస్ చైర్మెన్ అబ్బ గోని రమేష్‌గౌడ్, తహసీల్దారులు, ఎంపీడీవోలు, కౌన్సిలర్లు వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను గుండెల్లో పెట్టుకోవాలి

సంక్షేమ రాష్టంగా తెలంగాణ

అన్ని వర్గాల అభివృద్దే లక్ష్యం

75 ఏళ్ల పాలనలో కాంగ్రెస్ ఒక్క పథకం తేలేదు

సంక్షేమ సంబురాలలో ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : అన్ని వర్గాలను అభివృద్ధి చేసేందుకు కేసీఆర్ కృషి చేస్తున్నాడని, తెలంగాణ సంక్షేమ రాష్టంగా మార్చారని, ఆయన్ను గుండెలో పెట్టుకోవాలని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. దశాబ్ది ఉత్సవాలల్లో భాగంగా శుక్రవారం మిర్యాలగూడ ఆర్డీవో చెన్నయ్య అధ్యక్షతన తెలంగాణ సంక్షేమ సంబు రాలు స్థానిక శ్రీమన్నారాయణ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం కేసీఆర్ నిరంతరం తపిస్తున్నారని చెప్పారు. పేద ప్రజల అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలు తీసుకొస్తున్నారని అన్నారు. ప్రజల్లో ఆలోచనలేని అనేక గొప్ప పథకాలు తీసుకొచ్చి ప్రజల గుండెల్లో కేసీఆర్ చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో 1.47 లక్షల మందికి పథకాలలో లబ్ధి పొందరని తెలిపారు. తెలంగాణలో



దేవరకొండ

సంక్షేమం అభివృద్ధి పరుగులు పెట్టిస్తున్నారని, కేసీఆర్ వ్యక్తి కాదు.. శక్తి అని అన్నారు. 75 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఇలాంటి ఒక్క పథకం అయినా తీసుకొచ్చారని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. పేద ప్రజల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న కేసీఆర్కు అన్ని వర్గాల ప్రజలు అండగా నిలవాలని కోరారు. అనంతరం లబ్దిదారులకు ఆర్థిక సాయం చెక్కులు, గొర్రెల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మెన్ తిప్పన విజయసింహారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షులు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యులు మోసిన్ అలి, డీసీఎంఎస్ జిల్లా వైస్ చైర్మెన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, ఎంపీపీలు బాలునాయక్, మున్సిపల్ కమిషనర్ రవీందర్‌సాగర్, ఆర్డీవో కార్యాలయ డీఏవో రాధా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ చిట్టిబాబునాయక్, మున్సిపల్ వైస్ చైర్మెన్ కుర్ర విష్ణు, జెడ్పీటీసీ సభ్యురాలు లలితాహతిరామ్, ఎంపీడీవోలు గార్లపాటి జ్యోతిలక్ష్మి, జానయ్య అజ్మీర దేవిక, తహసిల్దార్లు అనిల్‌కుమార్, గణేష్, రైతు సంఘం జిల్లా నాయకులు నామిరెడ్డి యాదగిరిరెడ్డి, నూకల హనుమంతరెడ్డి, ఆర్పిఎస్ మండల అధ్యక్షులు ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు

ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ : సంక్షేమ పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో గత తొమ్మిదేండ్లలో సబ్బండ వర్ణాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని దేవరకొండ శాసన సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక సాయి రమ్య పంక్షన్ హాల్లో తెలంగాణా రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా తెలంగాణ సంక్షేమ సంబరాలలో 522 మంది లబ్ధిదారులకు రూ.5.22కోట్ల షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ, ఇండ్ల పట్టాలను, ఎస్సీ కార్పొరేషన్ చెక్కుల పంపిణీ, కులవృత్తులకు లక్ష రూపాయల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలోనూ



మునుగోడు

లేని విధంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారన్నారు. ఆర్డీఓ గోపిరాం అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీలు మాధవరం సునీతజనార్ధన్ రావు,వంగల ప్రతాప్‌రెడ్డి, బాణావత్ పద్మహన్మనాయక్, జడ్పీటీసీలు కంకణాల ప్రవీణావెంకట్‌రెడ్డి, కేతవత్ బాలునాయక్, జడ్పీటీసీ మారుపాకుల అరుణ సురేష్‌గౌడ్, పిఎసిఎస్ చైర్మెన్ వెలుగురి వల్లపురెడ్డి, రైతు బంధు అధ్యక్షులు ఉజ్జిని విద్యాసాగర్ రావు,రాజినేని వెంకటేశ్వర్ రావు,బోయపల్లి శ్రీనివాస్ గౌడ్,వైస్ ఎంపీపీలు చింతపల్లి సుభాష్, గోరేటి పుల్లమ్మ, అర్వపల్లి నర్సింహ, సర్పంచుల ఫోరం అధ్యక్షులు కుంభం శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు దొంతం చంద్రశేఖర్, ముత్యాల సర్వయ్య, ఎంపీడీఓ శర్మకమిషనర్ వెంకటయ్య, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

మునుగోడు : దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలను తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశపెట్టి తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శుక్రవారం మునుగోడు నియోజకవర్గం స్థాయి సంక్షేమ దినోత్సవంసమావేశాన్ని చండూరు రోడ్లో స్థానిక ధనలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కులాంతర వివాహం చేసుకున్న వారికి ఒక్కో జంటకు రెండు లక్షల రూపాయల చెక్కును అందజేశారు. బీసీ కులాల కులవత్తుల సంక్షేమ పథకాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా ఐదుగురు లబ్ధిదారులకు చెక్కులు అందజేసి ఈ పథకాన్ని ప్రారంభించారు. నియోజకవర్గ వ్యాప్తంగా మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గీత కార్పొరేషన్ చైర్మెన్ పల్లె రవికుమార్‌గౌడ్, జడ్పీ సీఈవో నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రేమ్ కరణ్‌రెడ్డి, కర్నాటి స్వామి యాదవ్, పల్లె కళ్యాణి, జడ్పిటిసిలు కర్నాటి వెంకటేశంవీరమల్ల భానుమతి, వివిధ మండలాల తాసిల్దార్లు, ఎంపీడీవోలు, సర్పంచులు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

● ఎస్పీ కే.అపూర్వరావు

నవతెలంగాణ-నల్లగొండ



తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ కే.అపూర్వరావ్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించాలని సూచించారు. మొత్తం జిల్లాలో 51 పరీక్షా కేంద్రాలలో 16,095 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని, వీరికి పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తుగా ఒక అడిషనల్ ఎస్పీ, ముగ్గురు డీఎస్పీలు, 25 మంది సిఐలు, 45 ఎస్ఐ లు, 170 మంది కానిస్టేబుల్‌లు బందోబస్తు నిర్వహించనున్నారని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇచ్చిన నియమాలు, సూచనలు పాటిస్తూ పరీక్షకు సిద్ధం కావాలని కోరారు. పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్స్, ఇంటర్ నెట్ సెంటర్స్, అన్ని మూసి వేయాలని, పరీక్ష సెంటర్స్ వద్ద నుండి 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడ వద్దు అని అన్నారు. పరీక్ష నిర్వహణకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రొబేషనరీ ఐపీఎస్ శేషాద్రినిరెడ్డి, అడిషనల్ ఎస్పీ కేఆర్‌కే ప్రసాదరావు, డిఎస్పీలు నరసింహారెడ్డి, నాగేశ్వర రావు, వెంకటగిరి, రమేష్, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల వేల ఎమ్మెల్యే కంచర్లకు చేదు అనుభవం

● అభివృద్ధి ఎక్కడ జరిగిందో చెప్పాలంటూ

నిలదీసిన ఇండ్లూరు వాసులు

నవతెలంగాణ-నల్లగొండ



నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డికి చేదు అనుభవం ఎదురయింది. అభివృద్ధి ఎక్కడ జరిగిందో చెప్పాలంటూ ఇండ్లూరి గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేని ప్రజలు నిడదీశారు. శనివారం తిప్పర్తి మండలం ఇండ్లూరు గ్రామంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డికి గ్రామస్తుల నుంచి చేదు అనుభవం ఎదురయింది. ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే కంచర్ల మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో పల్లెలు, పట్టణాలు ముందెన్నడు లేని రీతిలో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. గ్రామంలో ఒక కోటి 50 లక్షలతో అభివృద్ధి పనులు, సీసీ రోడ్ల నిర్మాణం జరిగిందన్నారు. దీంతో కొందరు గ్రామస్తులు ఎమ్మెల్యే మాటలన్నీ అబద్దాలని, ఆయన చెప్పిన నిధులతో అభివృద్ధి ఎక్కడ జరిగిందో, సీసీ రోడ్లు ఎక్కడ నిర్మించారో చెప్పాలంటూ నిలదీశారు. తమ గ్రామానికి ఎమ్మెల్యేగా ఏం చేయడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు, ఎమ్మెల్యేకు మధ్య వాగ్వివాదం చెలరేగింది. ఆ సమయంలో అక్కడికి చేరుకున్న తిప్పర్తి పోలీసులు జోక్యం చేసుకొని గ్రామస్తులను వారించారు. అనంతరం ఎమ్మెల్యే కంచర్ల అక్కడి నుంచి వెను తిరిగి వెళ్లిపోయారు.

నాటి కాంగ్రెస్ పాలన రావాలి

● సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణ-చందంపేట



నాటి కాంగ్రెస్ సంక్షేమ పాలన మళ్లీ రావాలని ప్రజలు కోరుతున్నారని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం దేవరకొండ నియోజక వర్గంలోని చందంపేట మండలంలోని పాతూర్ తండా నుంచి పాదయాత్ర ప్రారంభమైంది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల హామీలను పూర్తిగా విస్మరించిందని, ప్రకటనలు హార్భాటాలకే తప్ప అభివృద్ధి చేసింది శూన్యం అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మతం, మందు అనే మత్తులో ప్రజలను ముంచాయని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందన్నారు. ఈసారి కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రావడం ఖాయం అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారం లో రాగానే రైతులందరికీ ఏక కాలంలో 2 లక్షల రూపాయలను రుణ మాఫీ చేస్తామని చెప్పారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షులు శంకర్‌నాయక్, నేనావత్ బాలునాయక్, జగన్ లాల్ నాయక్, నేనావత్ కిషన్ నాయక్, జాలే నర్సింహారెడ్డి, వేణు దర్ రెడ్డి, ఎంపీపీ పార్వతి, జడ్పీటీసీ లచ్చిరాం బుజ్జి, నేనావత్ కుమార్‌నాయక్, జైపాల్‌నాయక్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కులవృత్తులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి

● రెండో విడత గొర్రెల పంపిణీలో

ఎమ్మెల్యే రవీంద్రకుమార్

నవతెలంగాణ-దేవరకొండ



కులవృత్తులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని దేవరకొండ శాసన సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్ తెలిపారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ఆర్థికవ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశు సంపద అభివృద్ధి తోపాటు గొర్రెల పెంపకదారుల జీవితాలలో ప్రభుత్వం వెలుగులు నింపుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ గోపిరాం, ఎంపీపీలు మాధవరం సునీతజనార్ధన్‌రావు, వంగల ప్రతాప్‌రెడ్డి, బాణావత్ పద్మహన్మనాయక్, జడ్పీటీసీలు కంకణాల ప్రవీణావెంకట్‌రెడ్డి, కేతవత్ బాలు నాయక్, జడ్పీటీసీ సలహాదారుడు మారుపాకుల సురేష్‌గౌడ్, ఉజ్జిని విద్యాసాగర్‌రావు, రాజినేని వెంకటేశ్వర్‌రావు, బోయపల్లి శ్రీనివాస్ గౌడ్, వైస్ ఎంపీపీలు చింతపల్లి సుభాష్, ఫోరం అధ్యక్షులు కుంభం శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మెండే రాముకు నివాళులు

నవతెలంగాణ-పెద్దవూర



పెద్దవూర మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ యువజన నాయకులు మెండే రాములు(28) గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. మాజీమంత్రి జనారెడ్డి శుక్రవారం పెద్దవూరకు చేరుకొని రాములు మృతదేహానికి నివాళులర్పించి కుటుంభ సభ్యులను పరామర్శించారు. నివాళులు అర్పించిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షులు పబ్బు యాదగిరి, పిఏసిఎస్ డైరెక్టర్ కొట్టె బాలయ్య, నడ్డి ఆంజనేయులు, కోట అంజి, రాము తదితరులు ఉన్నారు.

కర్నాటి లింగారెడ్డి ఆధ్వర్యంలో...

పెద్దవూర మండలం కేంద్రానికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకులు మెండే రాములు అనారోగ్యం కారణంగా గురువారం మృతి చెందారు. పిసిసి డెలిగేట్ మాజీ జెడ్పీ వైస్ ఛైర్మెన్ కర్నాటి లింగారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్రనాయకులు కుందూరు జయవీర్ రెడ్డి శుక్రవారం రాములు పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పెద్దవూర మండలం అధ్యక్షులు పబ్బుగిరిగౌడ్, నియోజకవర్గ అధ్యక్షులు పగడాల నాగరాజు, మండల యూత్ అధ్యక్షులు కిలారి మురళికృష్ణయాదవ్, వీరితోపాటు నియోజకవర్గం నాయకులు, మండల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఐదు గడ్డివాములు దగ్ధం

రూ.2లక్షల వరకు నష్టం

నవతెలంగాణ-నాంపల్లి



మండలంలోని పసునూరు గ్రామంలో రైతులు దండిగ సత్తయ్య వెంకటయ్య, శంకరయ్య అనే ముగ్గురు అన్నదమ్ములకు సంబంధించిన ఐదు గడ్డివాములు శుక్రవారం మధ్యాహ్నం పూర్తిగా ఖాళీ దగ్ధమయ్యాయి. ముగ్గురు అన్నదమ్ములు గ్రామంలో తమకున్న భూమిలో వ్యవసాయం చేసుకుంటూ పశువులు, బర్రెలతో జీవనం సాగిస్తున్నారు. ఇటీవలే పశువుల కోసం రెండు లక్షల వరకు ఖర్చు చేసి పశుగ్రాసాన్ని ముగ్గురు అన్నదమ్ములు కొనుగోలు చేసి తమ వ్యవసాయ పొలం వద్ద గడ్డివాము వేశామని తెలిపారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు తమ గడ్డివాములకు నిప్పు పెట్టి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తు కన్నీరు పెట్టుకున్నారు. ప్రభుత్వం తమను పశుగ్రాసం కోసం ఆర్థికంగా ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ప్రయాణికులకు ఆర్టీసీకి వారధిగా విలేజ్ బస్ ఆఫీసర్ వ్యవస్థ

నవతెలంగాణ-నల్లగొండ

ప్రయాణికులకు ఆర్టీసీ సంస్థకు వారధిగా విలేజ్ బస్ ఆఫీసర్ వ్యవస్థ నిలుస్తుందని నల్లగొండ రీజినల్ మేనేజర్ శ్రీదేవి అన్నారు. శుక్రవారం ఆర్టీసీ డిపోలో విలేజ్ బస్ ఆఫీసర్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ సంక్షేమ కార్యక్రమాలు చేయబడుతుందన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డిస్ట్రిక్ట్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ ఎం. సురేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రయాణికుల సౌకర్యార్థం తీసుకొస్తున్న మార్పులను గమనించి వాటిని తమకు అనుకూలంగా మలుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ జీ. రామ్మోహన్ రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ ఎం.ప్రవీణ్‌రెడ్డి, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు కోసం సైనికుడిలా పని చేయాలి

నవతెలంగాణ -చివ్వేంల

రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుని రాష్ట్రంలో అధికారం చేపట్టేందుకు ప్రతి కార్యకర్త సైనికుడి లాగా పనిచేయాలని ఆ పార్టీ బీసీసెల్ మండల అధ్యక్షుడు యల్కపల్లి వెంకన్న అన్నారు.శుక్రవారం మండలపరిధిలోని వట్టి ఖమ్మం పహాడ్ గ్రామంలోసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం గ్రామశాఖ అధ్యక్షునిగా పబ్బుసాయిగౌడ్‌ను ఎన్నుకున్నారు. అతనికి నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ ఉపాధ్యక్షులు యల్కపల్లి సైదులు,మండల సీనియర్ నాయకులు వీరబోయిన సైదులు యాదవ్,గోగుల శ్రీను,యల్కపల్లి సుధాకర్, సోషల్ మీడియా మండల ఇన్‌చార్జి వీరబోయిన మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్రాంతి కుమార్‌కు ప్రఖ్యాత సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్ సర్టిఫికెట్

నవతెలంగాణ- తుంగతుర్తి

ఫైనాన్షియల్ ప్లానింగ్‌లో గోల్డ్ స్టాండర్డ్ గా పరిగణించే సీఎఫ్‌పీ సర్టిఫికెట్ ను తుంగతుర్తి వాసి అయిన పచ్చిపాల క్రాంతి కుమార్ సాధించారు. శుక్రవారం స్థానికంగా క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఈ సర్టిఫికెట్ ను యునైటెడ్ స్టేట్స్ లోని ఫైనాన్షియల్ ప్లానింగ్ అండ్ స్టాండర్డ్ బోర్డ్(ఎఫ్ పి ఎస్ బి) అనే సంస్థ ఇస్తుందన్నారు. ఐదు దశల పరీక్షల తర్వాత చాలా ప్రాక్టికల్ నాలెడ్జి ఉందని బోర్డు సంతృప్తి చెందిన తర్వాత ఈ సర్టిఫికెట్ అందజేస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా 27 దేశాల్లో గుర్తింపు ఉన్న ఈ ప్రతిష్టాత్మక సర్టిఫికెట్ పొందడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.ఈ సందర్భంగా పలువురు బంధుమిత్రులు , గ్రామస్తులు క్రాంతి కుమార్ ను ఘనంగా సన్మానించారు.

కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం చేయూతనివ్వాలి

నవతెలంగాణ-నాగారం

కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం చేయూతనివ్వాలని బండి ఉప్పలయ్య అన్నారు. శుక్రవారం నాగారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల సీఎం కేసీఆర్ కుల వృత్తులకు లక్ష రూపాయలు ఆర్థిక సహాయం చేస్తా అన్నారు. కానీ అందులో కల్లుగీత కార్మికులను పరిగణలోకి తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రాణాలను మన చేతిలో పెట్టుకొని తాటికల్లు మీద బతికే కల్లుగీత కార్మికులను పెట్టడం ఏమిటని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంటనే కల్లుగీత కార్మికులకు కూడా లక్ష రూపాయలు ఆర్థిక సహాయం చేయాలని, లేనిపక్షంలో కల్లుగీత కార్మికుల ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మొగుళ్ల మహేష్, సభ్యులు బండి శీను, మొగుళ్ల నరసింహస్వామి, బండి యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్నల్ సంతోషబాబు త్యాగం చిరస్మరణీయం

నవతెలంగాణ-కోదాడరూరల్



కల్నల్ సంతోషబాబు త్యాగం చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే ఉత్తం పద్మావతిరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రధాన రహదారిపై వాసవి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంతోష్ బాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. దేశం కోసం కల్నల్ సంతోషబాబు చేసిన త్యాగాన్ని భవిష్యత్ తరాలకు తెలిసే విధంగా కోదాడలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, పట్టణ అధ్యక్షులు వంగవీటి రామారావు, వాసవి క్లబ్ రీజియన్ చైర్మన్ జగనీ ప్రసాద్, ఆర్యవైశ్య నాయకులు గరినే శ్రీధర్, వాసవి యూత్ క్లబ్ అధ్యక్షులు బెలిదే భరత్‌కుమార్, ఉప్పల నవీన్, యదా కిరణ్, భరత్ చంద్ర, బండారు శ్రీనివాసరావు, సాయి, వెంపటి ప్రసాద్, రంజిత్, పైడిమర్రి సతీష్, రామారావు, పోలిశెట్టి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మేర సంఘం మండల అధ్యక్షులుగా నాగేశ్వరరావు

నవతెలంగాణ- తుంగతుర్తి



తుంగతుర్తి మండల కేంద్రంలో మేర సంఘం విస్తతస్థాయి సమావేశంలో సంఘం మండల కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి గుంటి సత్యనారాయణ, అబ్జర్వర్ రేణిగుంట సురేందర్ పర్యవేక్షణలో మండల కమిటీ అధ్యక్షుడిగా రామగిరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా దీకొండ సురేష్, కోశాధికారిగా గట్ల జోగయ్య, తోపాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు సంఘం బలోపేతానికి కృషి చేస్తామని తెలియజేస్తూ, ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కీర్తి వెంకటేశ్వర్లు, రాములు, సతీష్, రమేష్, మేర కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

వస్త్రాలంకరణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-చందంపేట



చందంపేట మండలం ముడుదాండ్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు జక్కుల మున్నయ్య తమ్ముడు జక్కుల కృష్ణయ్య-శశికళ దంపతుల కుమార్తెలు సుస్మిత-రశ్మితల నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఆయన వెంట మండల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోటో వాడుకోగలరు.

ఏడుదోడ్ల రవీందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-నాంపల్లి



నాంపల్లి మండల రైతు బంధు సమితి కన్వీనర్ ఏడుదొడ్ల రవీందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం నాంపల్లి మండల వ్యాప్తంగా రవన్న యువసేన, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున చేరుకొని కేక్ కట్ చేసి, బాణాసంచా కాల్చి, స్వీట్స్ పంపిణీ చేశారు. దేవత్‌పల్లి గ్రామంలో వికలాంగులకు ట్రై సైకిల్స్ పంపిణి వారి చేత కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. రవన్న యువసేన వారు నాంపల్లి ఎంపీపీ ఏడుదోడ్ల శ్వేతా రవీందర్‌రెడ్డి చేతుల మీదుగా నాంపల్లి మండల ప్రభుత్వ ఆసుపత్రికి వాటర్ ఫిల్టర్‌ను బహూకరించారు. రవీందర్‌రెడ్డి అభిమానులు, అనుచరులు, నాయకులు కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కుందారపు రమేష్, బల్గూరి విష్ణు, సపవత్ సర్దార్, జల్లెల సైదులు, మండల యువజన నాయకులు బత్తుల విజయ్, మండల మైనారిటీ నాయకులు ఎండి సలీం, బీఆర్ఎస్ నాయకులు మానుపాటి యాదయ్య, పోతగోని మురళి, వీరమల్ల రవి, ఎరుకల నాగయ్య, జక్కుల రాజు, గౌరు కిరణ్, వట్టికోటి నరేష్, సంగెం గణేష్, మల్లికార్జున్, దశరథ తదితరులు పాల్గొన్నారు.

మెగా హెల్త్ స్క్రీనింగ్ క్యాంప్

నవతెలంగాణ-మునుగోడు

మునుగోడు మండల కేంద్రంలో సీపీఐ కార్యాలయంలో శుక్రవారం తెలంగాణ భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులకు నల్లగొండ లేబర్ ఆఫీస్ అధ్వర్యంలో కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) హెల్త్ కేర్ వారి ఆధ్వర్యంలో మెగా హెల్త్ స్క్రీనింగ్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ క్యాంపులో మునుగోడు మండల భవన నిర్మాణ కార్మికులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌సీ హెల్త్ డైరెక్టర్ పవన్ మాట్లాడుతూ..1320 పారమిటర్స్ పైగా,15000 వేల రూపాయలు విలువ గల ఆరోగ్య రకాల పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు. ఈ హెల్త్ స్క్రీనింగ్ కారక్రమాన్ని కార్మికుల అందరు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ చిరుమర్తి శ్రీనయ్య, జిల్లా క్యాంపు కోఆర్డినేటర్ బండారు శంకరయ్య, మక్కపల్లి మధు, ఏఐటీయూసీ కార్మిక నాయకులు యాదయ్య, శివయ్య, మాల్దారి, శ్రీను వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

రామ మందిరానికి శంకుస్థాపన

నవతెలంగాణ-కోదాడరూరల్



మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరంగాపురం గ్రామంలో నూతనంగా నిర్మించదలచిన శ్రీరామ మందిరంనకు బీఆర్ఎస్ నాయకులు ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు దేశానికే ఆదర్శం

•ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



నవతెలంగాణ-హుజూర్‌నగర్

రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణ్ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక అనసూయ గడ్డి రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జరిగిన నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ పథకాల వల్ల ఎందరో అమ్మాయిలకు వివాహాలకు ఆర్థికంగా తోడ్పాటు అందజేయడం జరిగిందన్నారు. ఈ పథకం అమ్మాయిల వివాహాలకు వరంగ మారిందన్నారు. ఈ సందర్భంగా 595 మంది లబ్దిదారులకు ఐదు కోట్ల 95 లక్షల 60 వేల కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. వివిధ చేతి వృత్తుల వారికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం ప్రభుత్వం అందించడానికి దరఖాస్తు స్వీకరిస్తుందని తెలిపారు. ఇలా నిర్మాణం కొరకు మూడు లక్షల రూపాయలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, ఎంపీపీలు, డీపీఓ యాదయ్య, జిల్లా అధికారులు కిషన్, ఎస్టీ వెల్ఫేర్ ఆఫీసర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

ఎమ్మెలే గాదరి కిశోర్ కుమార్

మద్దిరాల : తెలంగాణ రాష్ట్ర సంక్షేమ అభివృద్ధి పథకాలు దేశానికే ఆదర్శమని తుంగతుర్తి శాసనసభ్యులు గాదరి కిశోర్ కుమార్ అన్నారు. రాష్ట్ర దశాబ్ది వేడుకల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని బతుకమ్మ ఘాటు వద్ద తుంగతుర్తి నియోజకవర్గ సంక్షేమ అభివృద్ధి పథకాలపై ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 493 03 ఆసరా పెన్షన్లు , కల్యాణ లక్ష్మి, షాద్ ముబారక్ 10958 మందికి చెక్కులను పంపిణీ చేశామన్నారు. 8245 మందికికేసీఆర్ కిట్లు అందించమని రాష్ట్రంలో రైతులకు ఏ దేశంలో లేని విధంగా 24 గంటల ఉచిత కరెంటు, 93, 303 మంది రైతులకు రైతుబంధు 1100 కోట్లు, 940 మందికి ఐదు లక్షల రూపాయల రైతు బీమా అందించామని, కాళేశ్వరం ద్వారా సాగునీరు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు



యాదవులకు 8500 యూనిట్ల గొర్రెల పంపిణీ, ముదిరాజులకు చేప పిల్లల పంపిణీ ,గీతా కార్మికులకు ఐదు లక్షల ప్రమాద బీమా, మండల కేంద్రంలో 75 డబల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించామని తెలిపారు.. అనంతరం 16 లక్షలతో కొత్త చెరువు మత్తడి పునర్నిర్మాణ పనులకు, రూ.5లక్షలతో మురుగు కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక, పిడి కిరణ్ కుమార్, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షులు ఎస్‌ఏ రజాక్, ఎంపీపీగుడ్ల ఉపేంద్ర వెంకన్న, జెడ్పీటీసీ కన్న సురంభ వీరన్న గౌడ్, వైస్ ఎంపీపీ శ్రీరామ్ రెడ్డి సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీడీవో సరోజ తాసిల్దారు అమీన్ సింగ్ వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో నూతన ఒరవడులు సృష్టిస్తున్న వీసీ.సజ్జనార్

•విలేజ్ బస్ ఆఫీసర్ (విబివో) కార్యక్రమం ప్రారంభం

నవతెలంగాణ -యాదగిరిగుట్ట రూరల్



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ.సజ్జనార్ నూతన ఒరవడులు సృష్టిస్తున్నారు. ఆర్టీసీని ప్రజలకు చేరువ చేసే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం యాదగిరిగుట్ట డిపోలో విలేజ్ బస్ ఆఫీసర్ (విబివో) వినూత్న ప్రారంభ కార్యక్రమానికి యాదగిరిగుట్ట ట్రాఫిక్ సిఐ శివ శంకర్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి, నూతనంగా ఎన్నికైన విలేజ్ బస్ ఆఫీసర్‌లకు కిట్లను అందజేశారు. ఈ కిట్‌లో ఆర్టీసీ సంస్థ ద్వారా ఒక టీ షర్ట్, బ్యాగ్, కరదీపిక ఉంటుంది. విలేజ్ బస్ ఆఫీసర్‌గా ఎన్నికైన వారు వారి పరిధిలో గల గ్రామాలు, మండల కేంద్రాలు, పట్టణాలలోని గ్రామస్తులు, అధికారులతో ప్రతి నెల రెండు మూడు పర్యాయాలు మీటింగ్ లను ఏర్పాటు చేసి, గ్రామాలలోని సమస్యలను తెలుసుకొని వాటిని డిపో అధికారులకు తెలియజేస్తారు. గ్రామంలో గల స్కూల్, కాలేజ్ విద్యార్థుల వివరాలు, సీజన్ టికెట్ తీసుకొని ప్రయాణించే గ్రామస్తుల వివరాలు,వికలాంగుల వివరాలు, గ్రామాలలో జరిగే పెళ్ళిళ్ళు, విహారయాత్రలు చేసే వారి వివరాలు ముందుగానే తెలుసుకొని వారికి బస్సులు అద్దెకు ఇవ్వటం, ప్రత్యేక బస్సులు నడపటంలో కృషి చేయాలి, గ్రామస్తులకు సహకరించాలి. యాదగిరిగుట్ట డిపోలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ట్రాఫిక్ సీఐ నూతనంగా ఎన్నికైన విలేజ్ బస్ ఆఫీసర్ లకు, ఉద్యోగులకు అమూల్యమైన విషయాలను తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ బి.శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్, హుస్సేన్, అసిస్టెంట్ ఇంజనీర్ హన్మానాయక్, డిపో ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి శ్రీనివాస్ యాదవ్‌కు ఘన స్వాగతం

నవతెలంగాణ-చౌటుప్పల్

నకిరేకల్ లో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి వెళ్తున్న రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, గొర్రెల మేకల ఫెడరేషన్ చైర్మెన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్‌లను శుక్రవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు గుండెబోయిన అయోధ్య యాదవ్ ఆధ్వర్యంలో పూలమాలలు శాలువాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మునుగోడులో గొర్రెల పంపిణీ వెంటనే ప్రారంభించాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్నం బాలరాజు, ఆలే నాగరాజు, శ్రీనివాస్ యాదవ్, నల్ల పర్వతాలు యాదవ్, నారి బాలరాజు, గుండెబోయిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత గొర్రెల పంపిణీ

నవతెలంగాణ-హుజూర్‌నగర్‌రూరల్



మండల పరిధిలోని లక్కవరం గ్రామానికి చెందిన యాదవ సోదరులకు మంజూరైన ఆరు యూనిట్ల గొర్రెలను శాసనసభ్యులు శానంపూడి సైదిరెడ్డి శుక్రవారం సాయంత్రం లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం యాదవ సోదరుల కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ లబ్ధిదారులందరికి పంపిణీ చేస్తామని తద్వారా మాంసం ఎగుమతులో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గూడెపు శ్రీను, జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, లక్కవరం గుండెపంగు సౌజన్య, ఎంపీటీసీలు చీకూరి రాజు, ముడెం గోపిరెడ్డి, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు సుందరయ్య, లబ్దిదారులు పాల్గొన్నారు.



నేడు సుపరిపాలనా దినోత్సవం

•ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్

నవతెలంగాణ-భువనగిరిరూరల్

తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10.00 గంటలకు సుపరిపాలన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. శుక్రవారం అధికారులతో సుపరిపాలనా దినోత్సవం ఏర్పాట్లను ఆమె సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. తెలంగాణ సాధించిన తరువాత ఏర్పడిన కొత్త జిల్లాలు, డివిజన్లు, మండలాలు, గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల ఏర్పాటు ద్వారా ప్రజల ముంగిట్లోకి పరిపాలన రావడమే గాక సులభతరంగా పర్యవేక్షిస్తున్న విషయాలను తెలియజేయస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ డి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి సి హెచ్ కృష్ణారెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సునంద, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఎం నాగేశ్వర చారి, అధికారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

•ఎమ్మెల్యే కిషోర్‌కుమార్

నవతెలంగాణ-నాగారం



ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని తుంగతుర్తి నియోజకవర్గ శాసనసభ్యులు గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. శుక్రవారం నాగారం మండల పరిధిలోని పసునూరు గ్రామంలోని శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయ పునర్ ప్రతిష్ట ఉత్సవాలకు హాజరై దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పార్టీలకతీతంగా దేవాలయాలు నిర్మించుకొని పండుగను నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, రైతు సమన్వయ సమితి జిల్లా కమిటీ సభ్యులు పొదిల రమేష్‌గౌడ్, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ గుండగాని అంబయ్యగౌడ్, సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు కురం వెంకన్న, నల్లగంటి మల్లయ్య, చిత్తలూరి వెంకన్న, కంచరీ విజయ్, ఉప సర్పంచ్ మల్లెపాక కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నీటి ట్యాంకర్‌ను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు



•30 మందికి గాయాలు •నలుగురి మహిళల పరిస్థితి విషమం •అటుగా వెళుతున్న ఎంపీపీ నరేందర్‌రెడ్డి ఔదార్యం •క్షతగాత్రులను ఆస్పత్రికి తన వాహనంలో తరలింపు

నవతెలంగాణ-నార్కట్‌పల్లి


నార్కట్‌పల్లి మండలం ఏపీ లింగోటం శివారులో జాతీయ రహదారి 65పై చెట్లకు నీళ్లు పోస్తున్న ట్యాంకర్‌ను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టి 30 మందికి గాయాలైన సంఘటన శుక్రవారం జరిగింది. స్థానికులు ఎస్సై సైదా బాబు తెలిపిన వివరాల ప్రకారం..జాతీయ రహదారి వెంట డివైడర్ మధ్యలో ఉన్న మొక్కలకు జీఎంఆర్ సంస్థ వాటర్ ట్యాంకర్‌తో నీళ్ల పోస్తుంది. నిర్లక్ష్యంగా అతివేగంగా కోదాడ డిపోకు చెందిన బస్సు హైదరాబాద్ నుండి కోదాడకు వెళుతున్న ఆర్టీసీ బస్సు ట్యాంకర్‌ను వెనుకనుండి ఢీ కొట్టింది. ఈ ఘటనలో 30 మందికి గాయాలయ్యాయి. ఈ ప్రమాద సమయంలో బస్సులో 43 ప్రయాణికులున్నారు. 30 మందికి గాయాలు కాగా అందులో నలుగురి మహిళల పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులను నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు.

నలుగురి మహిళల పరిస్థితి విషమం

సంధ్య(బోగారం), లింగస్వామి(దుబ్బాక), నాగమణి(శోభనాద్రిపురం), మంజుల(దుబ్బాక), ఉష(లక్ష్మాపురం), బాబు, యాదమ్మ(దుబ్బాక), జ్యోతి(ఈస్కిల్లా) ఉన్నారు.

ఎంపీపీ సూది రెడ్డి నరేందర్ రెడ్డి ఔదార్యం

తెలంగాణ దశాబ్ద ఉత్సవాల్లో భాగంగా నకిరేకల్ పట్టణంలో జరిగిన గొర్రెల పంపిణీ సమావేశంలో పాల్గొనడానికి వెళ్తున్న ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి ప్రమాదాన్ని చూసి చలించిపోయి. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను బయటికి తీయించి తన కారులో కామినేని ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వారిని పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.



డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగింది : ఎస్ఐ సైదా బాబు

జాతీయ రహదారిపై అతివేగంగా రోడ్డు వెంబడి వస్తున్న వాహనాలను గమనించకుండా రోడ్డు వెంట మొక్కలకు నీళ్ల పోస్తున్న ట్యాంకర్‌ను వెనుక నుండి బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా వేగంగా నడుపుతూ ఢీకొట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పలువురి పరామర్శ : జాతీయ రహదారిపై ట్యాంకర్‌ను ఢీకొట్టిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను శుక్రవారం కామినేని ఆస్పత్రిలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డితో కలిసి పరామర్శించారు. అదేవిధంగా బీఎస్పీ నకిరేకల్ ఇన్‌చార్జి ప్రియదర్శిని మేడి పరామర్శించారు. అదేవిధంగా కామినేని హాస్పిటల్ చికిత్స తీసుకుంటున్న ఔరవాని గ్రామానికి చెందిన నడిగోటి మల్లేష్ కుడి చేయి ఫ్యాక్చర్ అవడంతో ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల ఉషయ్య పరామర్శించారు. ఈ పరామర్శలో ఔరవని ఉప సర్పంచ్ పరమేష్, సతిష్, సురేష్, తదితరుల పాల్గోన్నారు.

మాదిగలకు అన్యాయం చేస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

నవతెలంగాణ-మిర్యాలగూడరూరల్

మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ పదవిని రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించగా ఎమ్మెల్యే భాస్కర్‌రావు నియోజకవర్గంలో ఎస్సీ సామాజిక వర్గంలో అధిక సంఖ్యలో ఉన్న మాదిగలకు కేటాయించకుండా తక్కువ సంఖ్యలో ఉన్న మాల కులస్తులకు కేటాయించడం తగదని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ పదవిని సంవత్సరం నుండి నుండి భర్తీ చేయకుండా కాలయాపన చేస్తూ మిగిలిన ఆరు నెలలకు గాను మిర్యాలగూడ పట్టణం, మండలం నుండి భర్తీ చేయకుండా ఇతర మండలం నుండి భర్తీ చేయడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే అధిక సంఖ్యలో ఉన్న మాదిగలకు చైర్మెన్ పదవిని కేటాయించాలని, లేనట్లయితే రాబోయే ఎన్నికల్లో తగిన మూలం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

బడిబాట

నవతెలంగాణ-పెద్దవూర

మండలంలోని పెద్దవూర పంచాయితీలోని ఈదులగూడెం, సంగారం, పెద్దవూర గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామప్రజలు తల్లితండ్రులతో కలిసి నిర్వహించారు. ప్రభుత్వ బడుల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కుంభ పార్వతి, ఉపాధ్యాయులు చంద్రమౌళి, ఎస్ఎంసీచైర్మెన్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కనీస మద్దతు ధరల పెంపుపై హర్షం

నవతెలంగాణ-నకిరేకల్

రైతులకు మేలు చేసే వ్యవసాయ ఉత్పత్తులపై కనీస మద్దతు ధరలు ప్రధాని నరేంద్ర మోడీ పెంచడం పట్ల బీజెపి కిసాన్ మోర్చా జాతీయ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని తాటికల్ గ్రామంలో పలువురు రైతులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు యానాల శ్రీనివాస్‌రెడ్డి, గునుగుంట్ల సాయన్న, జిల్లా మోర్చా ఉపాధ్యక్షులు జిల్లా డాకయ్య చెనగాని రాములు, బూత్ అధ్యక్షులు చనగాని సైదులు, కారింగుల శ్రీనివాస్, ముచ్చపోతుల అనసూర్య, చెనగాని అంజయ్య, ట్రాక్టర్ లింగయ్య మల్లెగొని వీరస్వామి, గోపగాని గురువయ్య, తదితరులు పాల్గొన్నారు.

అనుదినం జనపక్షం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
యాదాద్రిభువనగిరి
4
శనివారం 10 జూన్ 2023

మధ్యాహ్న భోజనకార్మికులకు పెంచిన వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ -భువనగిరిరూరల్

మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాలు, పెండింగ్ బిల్లును వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండి.ఇమ్రాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్న భోజన వంట కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ పరిపాలన అధికారి ఎం.నాగేశ్వరా చారికి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, మధ్యహన భోజన వంట కార్మికుల జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జిన్నా కృష్ణ, ముంతాజ్ బేగం, కార్మికుల అనసూయ, లక్ష్మి, సంధ్య పాల్గొన్నారు

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు

నవతెలంగాణ -ఆలేరురూరల్

మండలంలోని మందనపల్లి గ్రామంలో సర్పంచ్ కోటగిరి పాండరి ఆధ్వర్యంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా బోనాలు బతుకమ్మలతో చెరువు వద్దకు వెళ్లి గట్టు మైసమ్మకు బోనం సమర్పించారు..ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేందర్ ,ఉప సర్పంచ్ జంపాల సత్యనారాయణ, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సుంచు మహేందర్ ,మాజీ మిల్క్ సెంటర్ చైర్మెన్ నారి వీరస్వామి, వార్డు సభ్యులు వంగ కిషన్, సత్తనారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని నిరసన

నవతెలంగాణ -ఆలేరు



మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌పై చర్యలు కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో హమాలీ కార్మికులు శుక్రవారం మండల కేంద్రంలో హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారిపై ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా నాయకులు మోరిగాడు రమేష్ మాట్లాడుతూ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్ పై వెంటనే చటపరమైన చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హమాలీ కార్మికులు ఎగ్గిడి.ఐలయ్య, సుంకరి బాలరాజు ,రేగు బీరయ్య, బర్ల మల్లయ్య, అమర కిష్టయ్య, బి సంపత్ ,కె. రాములు పాల్గొన్నారు.

ఫిష్ ఫుడ్ ఫెస్టివల్

నవతెలంగాణ - భువనగిరి

స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న ఫిష్ ఫుడ్ ఫ్రిస్టివల్ లో భాగంగా రెండవ రోజు శుక్రవారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఫిషరీస్ ఆఫీసర్ రాజారాం మాటాకలడేతై అన్ని రకాల చేపల వంటకాలు అతి తక్కువ ధరలకు విక్రయిస్తున్నట్టు తెలిపారు.

17,18 తేదీల్లో ఐలూ రాష్ట్ర మహా సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ - భువనగిరి



స్థానిక భువనగిరి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లో నిర్వస్తున్న ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ తృతీయ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి కొల్లి సత్య నారాయణ తెలిపారు.శుక్రవారం పట్టణకేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూబైపాస్ వద్ద గల న్యూ దీప్తిహోటల్ లో రాష్ట్ర మహాసభనిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్వల్ బోయన్ హాజరుకానున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నాగారం అంజయ్య, ప్రధాన కార్యదర్శి ఎండి.ఇస్మాయిల్, కోశాధికారి రాజశేఖర్ రెడ్డి, దామోదర్ రెడ్డి, నర్సింగ్ యాదవ్, సీసీ శ్రీనివాస్ నర్సిరెడ్డి, బాబురావు, బొల్లెపల్లి కుమార్ పాల్గొన్నారు

సీపీఐ ప్రజా గర్జనను జయప్రదం చేయండి

నవతెలంగాణ -రాజాపేట

ఈ నెల11న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో లక్ష మందితో జరిగే ప్రజా గర్జనను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి చిగుళ్ల లింగం కోరారు. శుక్రవారం మండలకేంద్రంలో పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. దేశంలోని రాష్ట్రంలోని ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు.ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో మండల సహాయ కార్య దర్శి ఇంజ హేమలత, దయ్యాల సిద్దులు, బొడ్డుల ఆదినారాయణ, నంద మల్లేశం, రచ్చ నర్సింలు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు పంపిణీ

నవతెలంగాణ-భువనగిరిరూరల్

ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ భువనగిరి ఆధ్వర్యంలో 15 కుట్టు మిషన్‌లను శుక్రవారం జిల్లాకేంద్రంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రెసిడెంట్ లావణ్య మాట్లాడుతూ పేద , మధ్య త రగతి మహిళలకు ఉపాధి కల్పించడం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో సెక్రటరీ జ్యోతి , డాక్టర్ అశ్లేష, చావు ఫౌండేషన్ అధినేత డాక్టర్ రాజ్ కుమార్ ,డాక్టర్ జయశ్రీ, డాక్టర్ చావా అసలేష, అశ్లేష, సిడబ్ల్యుసి చైర్మన్ బండారు జయశ్రీ, కల్పన, సునీత, వెంకమ్మ, చావా ఫౌండేషన్ అధినేత డాక్టర్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ -అడ్డగుడూర్

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 63మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దర్శనాల అంజయ్య, తహసీల్దార్ దశరథ నాయక్,ఎంపీడీవో చంద్రమౌళి, జెడ్పీటీసీ శ్రీరాముల జ్యోతి-అయోధ్య,ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచులు పరమేష్ గౌడ్,నారగోని అంజయ్య గౌడ్,జోజి, బాలయ్య,బీఆర్ఎస్ మండల నాయకులు మెట్టు భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

కుల వృత్తులకు రూ.లక్ష సాయంలో చేనేతను చేర్చాలి

నవతెలంగాణ-మోత్కూర్



కుల వృత్తుల పరికరాల కొనుగోలు కోసం ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థిక సాయంలో చేనేతను చేర్చి కార్మికులకు అమలు చేయాలని చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. శుక్రవారం మోత్కూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీ వర్గాల్లోని కుల, చేతి వృత్తిదారులు పనిముట్ల కొనుగోలు కోసం ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయంలో చేనేత కుల వృత్తిని చేర్చకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం నూలు, రంగులు, బట్టల పై జీఎస్టీ పేరుతో పన్నులు వేసి కార్మికుల కొట్ట కొడుతుందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే చేనేతను కూడా చేర్చాలని, చేనేత బంధు అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు వంగరి రాములు, పసునూరి నారాయణ పాల్గొన్నారు.

పాల్వాయి గోవర్ధన్ రెడ్డి వర్థంతి

నవతెలంగాణ-చౌటుప్పల్



చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని రాజీవ్ స్మారక భవనంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాల్వాయి గోవర్ధన్ రెడ్డి ఆరవ వర్థంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బ్లాక్, మున్సిపల్, మండల అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, సూర్య నరసింహ గౌడ్, బోయ దేవేందర్ గోవర్ధన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కళ్లెం దయాకర్ రెడ్డి, పందుల రాజేష్, ఊదరి శ్యాం, షేక్ అబ్బాస్ బేగం, ఊదరి సురేష్, దేశగోని మల్లేష్, చికూరి యాదయ్య, కొసనం భాస్కర్ రెడ్డి, గోపాలు, బుచ్చయ్య, బడే సాబ్, రాజశేఖర్, ఎండి.గౌస్ ఖాన్, ఎర్ర శంకర్, ఎర్రగోని లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం:మాజీ మంత్రి పాల్వాయి గోవర్ధన్ రెడ్డి వర్థంతి కార్యక్రమాన్ని శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులుఏపూరి సతీష్,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మందు గులబాలకృష్ణ,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు అందె నరేష్ యాదవ్,మైనార్టీ మండల అధ్యక్షులు మహమ్మద్ అలీ ఖాజా, నాయకులు జక్కా నాగభూషణం,సుర్వి ముత్యాలు,రాజు,పాశం ధర్మయ్య,బోయిని నరసింహ,అయితే గొని సుభాష్,సుర్కంటి ఆదిరెడ్డి,చిలువేరు కృష్ణ,చిలువేరు నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

11న ఎమ్మార్పీఎస్ ఉమ్మడి నల్గొండ జిల్లా మహాసభ

నవతెలంగాణ -భువనగిరిరూరల్

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధన కోసం జరుగుతున్న పోరాటంలో భాగంగా ఈనెల 11న వలిగొండ మండల కేంద్రంలో జరిగే ఉమ్మడి నల్గొండ జిల్లా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్ మాదిగ కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ మహాసభకు మంద కృష్ణమాదిగ హాజరుకానున్నట్టు తెలిపారు. మహాసభకు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

మహిళా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలుగా దీప

నవతెలంగాణ -ఆలేరురూరల్

ఆలేరు మండలంలోని కొల్లూరు గ్రామానికి చెందిన గ్యాదపక దీపను మహిళా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ ఆమెకు నియామక పత్రం అందజేశారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల ఐలయ్యకి టీపీటీసీ రాష్ట్ర కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డిలకు ఆమే కృతజ్ఞతలు తెలిపారు.

లారీలు పంపించరూ..

- **కొనుగోలు కేంద్రాల్లోనే ఇంకా ధాన్యం**

నవతెలంగాణ -ఆలేరురూరల్



ఆరుగాలం కష్టించి ధాన్యాన్ని అమ్మడానికి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి రెండు నెలలు గడుస్తున్నా కొనుగోళ్లు వేగవంతం కాకపోవడం, లారీల కొరతతో ఇంకా ధాన్యం కళ్లలోనే మిగిలిపోయింది. మండలంలోని గొలనుకొండ గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి 60 రోజులు అయినప్పటికీ ఇంకా ధాన్యం కొనడం లేదు. మండలంలో ఈ గ్రామం మేజర్ గ్రామపంచాయతీ కావడంతో ఇక్కడ రైతులు ఎక్కువ వరి పంట సాగు చేశారు. 200 మంది రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకొస్తే 150 మంది అమ్మారు. ఇంకా 50 మంది ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మూలుగుతుంది. ఈ గ్రామం మండలానికి 15 కిలోమీటర్ల దూరం ఉంది. లారీలు సమయానికి రావాలంటే రైతులను డబ్బులు అడుగుతున్నారని ఇవ్వం అని చెప్పడంతో మూడు రోజులకు ఒక లారీ మిల్లర్లు పంపిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. గడ్డి, తాలు, తేమ పేరుతో నిర్వాహకులు కిలో 600 గ్రాములు అదనంగా కట్ చేస్తున్నారని, మిల్లర్లు తరుగు పేరుతో దోపిడీ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. కొనుగోలు కేంద్రం వద్ద కనీసం మంచినీళ్లు కూడా ఏర్పాటు చేయడంలేదని పేర్కొంటున్నారు. రోజు ఉరుములు మెరుపులతో కూడిన గాలి దుమారాలు వర్షాలు పడుతుండడంతో రైతులు ధాన్యం విడిచి ఇంటికి వెళ్లకుండా కుప్పల దగ్గరే పడిగాపులు కాస్తున్నారు. కొనుగోలు కేంద్రం వద్ద 3000 బస్తాలు కాంటవేసి పంపించడానికి సిద్ధంగా ఉన్నాయి కానీ మూడు రోజుల నుండి లారీలు రాలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు లారీలను సమయానికి పంపించి ధాన్యం కుప్పలు ఉండకుండా చూడాలని కోరుతున్నారు.

కాంటా వేసి మూడు రోజులవుతుంది-లింగారెడ్డి రైతు



కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యం తీసుకువచ్చి 45 రోజులు అవుతుంది. ధాన్యం కాంటా వేసి మూడు రోజులు అవుతుంది. లారీల కొరతతో తూకం వేసిన ధాన్యం బస్తాలు కొనుగోలు కేంద్రంలోనే ఉన్నాయి. ఎప్పుడు లారీ వస్తది ధాన్యం ఎప్పుడు తీసుకెళ్తారని ఎదురుచూస్తున్నాను ఇక్కడే రాత్రి సమయంలో పడుకుంటున్నాను. ఇంకా రెండు రోజులు పడుతది లారీలు రావడానికి అని నిర్వాహకులు చెబుతున్నారు.

టీడీపీ ముఖ్య కార్యకర్తల సమావేశం

నవతెలంగాణ- భువనగిరిరూరల్

జిల్లాకేంద్రంలో టీడీపీ ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మన్నె సంజీవరావు మాట్లాడుతూ ఇంటింటికిటీడీపికార్యక్రమం మొదటి విడత పూర్తి చేసుకున్నామని, త్వరలోనే రెండో విడత ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు అధికార ప్రతినిధి ఎలిమినేటి సుధాకర్ రెడ్డి ,మండల అధ్యక్షులు ఎర్రబోయిన రమేష్ యాదవ్, వలిగొండ మండల అధ్యక్షులు కల్లూరు నవీన్ కుమార్, పోచంపల్లి మండల పట్టణ పార్టీ అధ్యక్షులు మీసాల నరసింహ, లక్ష్మయ్య, బోనగిరి పార్లమెంటు ప్రధాన కార్యదర్శి తెలుగు యువత రేపు బీరప్ప, భువనగిరి మండల ప్రధాన కార్యదర్శి కనకరాజు, సీనియర్ నాయకులు రత్నపురం నరసింహ పాల్గొన్నారు.



గొర్రెల పంపిణీతో చేయుత

నవతెలంగాణ -ఆలేరుటౌన్

రెండో విడుతలో మంజూరు చేసిన గొర్రెల పంపిణీతో గొల్ల కురుమలకు ప్రభుత్వం చేతనందిస్తుందని ప్రభుత్వ విప్ ,ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి అన్నారు.శుక్రవారం పట్టణంలో రెండవ విడత గొర్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రతి గడపకు లబ్ది చేకూరుస్తున్న ఏకైక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం చైర్మెన్ వస్పరి శంకరయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ చింతకింది చంద్రకళ మురహరి,వెటర్నరీ డాక్టర్ చైతన్య, వార్డు కౌన్సిలర్లు బేతి రాములు, జూకంటి శ్రీకాంత్, మాజీ సర్పంచ్ చింతకింది మురళి , జల్లి నరసింహులు, పత్తి వెంకటేశు , దయ్యాల సంపత్, జూకంటి ఉప్పలయ్య , బీజని బాలరాజు,బీఆర్ఎస్ మాజీ పట్టణ అధ్యక్షులు మొరిగాడి వెంకటేష్, పోరెడ్డి శ్రీనివాస్ , పాషికంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గీత కార్మికుడు మృతి

నవతెలంగాణ-గుండాల



తాటిచెట్టుపై నుండి జారిపడి గీత కార్మికుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం మండలంలోని వెల్మజాల గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాళ్లపల్లి పాపయ్య(55) శుక్రవారం సాయంత్రం కల్లు తీయడానికి తాటి చెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు కాలు జారడంతో కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. మృతునిది నిరుపేద కుటుంబం కావడంతో ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియో చెల్లించి ఆదుకోవాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొలగాని జయరాములు గౌడ్ కోరారు.

సంక్షేమాన్ని దిగ్విజయంగా నడిపిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం

నవతెలంగాణ - భువనగిరి



రాష్ట్ర ముఖ్యమంత్రి మేధోమధనం చేసి వివిధ రంగాల అభివృద్ధితో సంపద సృష్టిస్తూ సంక్షేమ కార్యక్రమాలను దిగ్విజయంగా నడిపిస్తున్నారని, అసాధ్యాలను సుసాధ్యం చేస్తున్నారని భువనగిరి శాసనసభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శుక్రవారం నియోజక వర్గానికి సంబంధించి స్థానిక ఎకె ప్యాలెస్‌లో సంక్షేమ సంబురాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ తొమ్మిదేళ్లుగా ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. సంవత్సరంలోపే 24 గంటల కరెంటు ఇచ్చారన్నారు. సాగునీరు రంగంపై దృష్టి సారించారన్నారు.కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, మహిళల సంక్షేమ కోసం కల్యాణలక్ష్మి, కెసిఆర్ కిట్స్, గర్భిణీ స్త్రీలకు ఆర్థిక సహాయం, న్యూట్రిషన్ కిట్స్ అందించడం జరుగుతున్నట్లు తెలిపారు. అనంతరం పీఎం అభయ్ స్కీమ్, దళితబంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, చేనేత వృత్తుల వారికి, లబ్దిదారులకు గొర్రెల యూనిట్ల పంపిణీ ,కుల వృత్తుల వారికి చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, మున్సిపల్ చైర్మెన్ ఎనబోయిన ఆంజనేయులు, జిల్లా రైతు సమన్వయ సమితి కన్వీనర్ అమరేందర్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ అమరేందర్ గౌడ్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సి.హెచ్. కృష్ణారెడ్డి, ఎంపీపీలు నరాల నిర్మల, ప్రభాకర్ గౌడ్, ప్రణీత పింగళ్ రెడ్డి, జెడ్పీటీసీలు బీరు మల్లయ్య, పుష్పలత, ప్రభాకర్రెడ్డి, వాకిటి పద్మ, మార్కెట్ కమిటీ చైర్మెన్ రాజేందర్రెడ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ సంక్షేమ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పట్ల స్పందించాలని ప్రజల వేడుకోలు

- **నాలుగు నెలలైనా స్పందించని సర్పంచ్**

నవతెలంగాణ -వలిగొండ



మేజర్ గ్రామపంచాయతీ వలిగొండ స్థానిక ఐదవ వార్డు ఆరవ వార్డులకు సంబంధించిన పదిమంది కుటుంబాలకు సంబంధించిన అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ ధ్వంసమై నాలుగు నెలలవుతున్నా అసంపూర్తిగా వదిలి వేయడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానిక సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని అక్కడి ప్రజలు బొంగు లక్ష్మమ్మ కనక పోయిన పద్మ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానికంగా వారు మాట్లాడుతూ ఇటీవల రేణుక ఎల్లమ్మ కళ్యాణం సందర్భంగా



బోనాలు వెళ్లే సమయంలో అసంపూర్తి డ్రైనేజీని దాటి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు గ్రామసభలో వెంటనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన అటువైపు కన్నెత్తి సర్పంచ్ చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు డ్రైయినేజీలో పడి ఒకరి చేయి సైతం విరిగిందన్నారు. ఇప్పటికైనా స్పందించి అసంపూర్తిగా ఉన్న డ్రైయినేజీ పూర్తి చేయాలని లేనియెడల గ్రామపంచాయతీ ముందు నిరసన వ్యక్తం చేస్తామని తెలిపారు .

భూములు అప్పగించేంతవరకు న్యాయపోరాటం

- **జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు**

నవతెలంగాణ -ఆలేరుటౌన్



పురపాలక సంఘంలోని, అంబేద్కర్ నగర్ ఎస్సీ కాలనీకి చెందిన దళిత మహిళలకు చెందిన భూములు తిరిగి అప్పగించేంతవరకు న్యాయపోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు తెలిపారు . శుక్రవారం పట్టణంలోని టీఎన్జీవో భవనంలో దళిత మహిళలతో భూబాధితులతో కలిసి సమావేశం నిర్వహించారు. మున్సిపల్ టౌన్ లో ఎస్సీ భూమి బాధితులు,ఎస్సీ కార్పొరేషన్ కింద వచ్చిన 60 కుటుంబాల సభ్యులు 130 ఎకరాలు ఆనాడు , అమ్మిన పరిస్థితులలో, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రలోభాలకి గురిచేసి తక్కువ రేట్లుకి కొనుగోలు చేశారని ఆరోపించారు. దళిత భూములపై జరిగిన అవకతవగలపై హైకోర్టులో పిటీషన్ దాఖలైందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చెక్క వెంకటేశ్, మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య, భూబాధిత మహిళలు మదపాక బుచ్చమ్మ, గంధ మల్ల లక్ష్మి, కందుల శ్యామల, కోనపురం సుశీల, జి.యాదగిరి, ఎర్ర సువర్ణ, కందుల లక్ష్మీబాయి, సిరిపురం లక్ష్మీనరసమ్మ, ఎల్లమ్మ, సుక్క ఎల్లమ్మ, కందుల ఎల్లమ్మ, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే సంక్షేమ పథకాలు అమలు

- **రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మెన్ రామకృష్ణారెడ్డి**

నవతెలంగాణ-మోత్కూరు



బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే పేద ప్రజలకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మోత్కూరు మండల పరిషత్ కార్యాలయంలో 92 మంది కల్యాణలక్ష్మి, షాదీముబాకర్ లబ్దిదారులకు ఆయన చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాల తల్లిదండ్రులు ఆడబిడ్డల పెళ్లి చేసేందుకు ఎన్నో కష్టాలు పడటం చూసిన సీఎం కేసీఆర్ ఆడబిడ్డ పెళ్లికి సాయం చేయాలన్న లక్ష్యంతో కళ్యాణ లక్ష్మీ పథకం తెచ్చి తొలుత రూ.51116 ఇవ్వగా పెరుగుతున్న ఖర్చులతో దశలవారీగా పెంచుతూ ప్రస్తుతం రూ. లక్షా 116 ఇస్తున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఏదో ఒక సంక్షేమ పథకం అందిందని, కేసీఆర్ లేకపోతే ఇప్పుడు ఇచ్చే పథకాలు ఉంటాయో లేదో ప్రజలు ఆలోచించాలన్నారు. యువ నాయకుడైన ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెండుసార్లు ఎమ్మెల్యేగా ఉండడంతో నియోజకవర్గంలో అన్ని విధాల అభివృద్ధి జరుగుతుందని, మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకొని నియోజకవర్గ అభివృద్ధిని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రచ్చ కల్పనలక్ష్మీనర్సింహారెడ్డి, మార్కెట్ చైర్మన్ కొణతం యాకూబ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తీపిరెడ్డి సావిత్రిమేఘారెడ్డి, వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, తహసీల్దార్ షేక్ అహ్మద్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ కొండా సోమల్లు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) మండల కార్యదర్శికి పితృవియోగం

నవతెలంగాణ- అడ్డగూడూరు



మండలంకేంద్రంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బుర్రు అనిల్ కుమార్ తండ్రి బుర్రు చంద్రయ్య శుక్రవారం మధ్యాహ్నం అనారోగ్యంతో మరణించారు. చంద్రయ్య భౌతికకాయాన్ని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ సందర్శించి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంతాపం ప్రకటించిన వారిలో ఆ పార్టీ జిల్లా నాయకులు మాటూరి బాలరాజు, బొల్లు యాదగిరి , దాసరి పాండు ఉన్నారు.

చంద్రయ్య భౌతికకాయాన్ని బీఆర్ఎస్ మండల నాయకులు పిల్లి సుందర్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పిల్లి గంగయ్య ,నిమ్మల సత్యం గౌడ్ ,కుమ్మం సోమయ్య, నీరుమాల్ల వెంకటేష్, మండల రిపోర్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు లేచిపోయిన రేకులు

- **నేల కూలిన విద్యుత్ స్తంభాలు**
- **నిలిచిన విద్యుత్ సరఫరా**

నవ తెలంగాణ భువనగిరి రూరల్



మండలంలోని వీరవెల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం పండింది. గ్రామంలో రెండు ఇండ్ల పై రేకుల కప్పులు లేచిపోయాయి. గ్రామానికి చెందిన రాళ్ల బండి పద్మ, రాళ్ల బండి రాజమానికి సంబంధించిన ఇంటిపై కప్పులేచిపోవడంతో వారు నిరాశ్రయులయ్యారు. ఈదురు గాలులకు గ్రామంలోని 30 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈ సమస్యతో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ధాన్యంపై కప్పులు లేచిపోయి ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తంగేళ్లపల్లి కల్పన శ్రీనివాస చారి మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యంతో ధాన్యం తడిసినదన్నారు. వెంటనే పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని,నిరాశ్రయులను ఆదుకోవాలని కోరారు.

అధికారులు సమయపాలన పాటించాలి

నవతెలంగాణ -ఆలేరురూరల్



వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధికి తోడ్పడాలని ఎంపీపీ గంధ మల్ల అశోక్, జెడ్పీటీసీ కుడుదుల నగేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు ప్రజలకు చేదోడు వాదోడుగా ఉండి సంక్షేమ ఫలాలు నిజమైన లబ్దిదారునికి అందుతున్నాయా లేదో చూడాలన్నారు. గ్రామాలలో విద్యుత్ సమస్య లేకుండా చూసుకోవాల్సిన అధికారులకు ఉందన్నారు. తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సలీం, సూపరింటెండెంట్ వెంకటరమణ ,వివిధ శాఖల అధికారులు పద్మజ ,సూపర్‌వైజర్ ఆండాలు, ఏపీఎం మీనా ,మిషన్ భగీరథ ఏఈ నాగసాయి, విద్యుత్ ఏఈ శ్రీనివాస్ ,సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ యూత్ క్రికెట్ టోర్నమెంట్

నవతెలంగాణ - భువనగిరి



భువనగిరి ఎస్ఎల్ఎన్ఎస్ కళాశాల మైదానంలో చల్ల గురుకుల రఘుబాబు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహిస్తున్న రాహుల్ గాంధీ 2023 జిల్లాస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ క్రీడా పోటీలను మున్సిపల్ మాజీ చైర్మెన్ బర్రె జహంగీర్ టాస్ వేసి రాంపురం తండా వర్సెస్ రాయగిరి స్టేషన్ జట్ల మొదటి మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మనోవికాసానికి ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. నిర్వాహకులు చల్లగురువు మాట్లాడుతూ యువకులలో చైతన్యం తీసుకురావడానికి స్నేహభావం పెంపొందించడానికి ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సురుపంగా చందు, శ్యామ్, నక్కల ఆదినారాయణ పాల్గొన్నారు.

మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఏర్పాటు

నవతెలంగాణ- సంస్థాన్ నారాయణపురం

మండలంలోని పుట్టపాక గ్రామంలో నూతనంగా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఏర్పాటు చేశారు. ముదిరాజ్ లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు సబ్సిడీ కింద అందించడం కోసం సంగం ఏర్పాటు చేసుకున్నారు.ఉప ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్సీ, శాసనమండలి వైస్ చైర్మెన్‌బండ ప్రకాష్ ముదిరాజ్ ఈ సొసైటీ ఏర్పాటు కోసం కృషి చేసినట్లు తెలిపారు. సొసైటీ రిజిస్ట్రేషన్ల పత్రాలను శుక్రవారం మునుగోడు ఎమ్మెల్యే కోసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు వీరమల్ల భానుమతి వెంకటేష్ గౌడ్,బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు ఆడెపు పరదేశి, యువజన విభాగం అధ్యక్షులు ఆడెపు సురేష్ కుమార్, కత్తుల లక్ష్మయ్య,పుట్టపాక మత్స్య పారిశ్రామిక సహకార సంఘము కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

